Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 300 పేజీలు 8 వెల : 5 మంగళవారం 19 మే 2026






## మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

భావితరాలకు భద్రపరచిన అమూల్య వారసత్వ సంపద

అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి

2లో..



# న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఏపి అగ్రగామి

**న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశ**

**యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరంలో లోకేశ్**

న్యూఢిల్లీ: ఏపీని భవిష్యత్తు న్యూక్లియర్ ఆర్థికవ్యవస్థలో నమ్మకమైన గ్లోబల్ భాగస్వామిగా నిలబెట్టడం తమ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్ననేపథ్యంలో ఇది కీలకంగా మారగలదని పేర్కొన్నారు. న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం సంయుక్తంగా యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా పేరిట యూఎస్ న్యూక్లియర్ ప్రతినిధులతో సోమవారం ఢిల్లీలో నిర్వహించిన సదస్సుకు మంత్రి నారా లోకేశ్ అతిథిగా హాజరై ప్రసంగించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉందని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అమలు చేస్తున్నామని అన్నారు. పారిశ్రామికీకరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యమని చెప్పుకొచ్చారు. ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖ పాత్ర వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరితరం రియాక్టర్ సిస్టమ్స్ వంటి ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలు, మాడ్యులర్ తయారీ, సప్లయ్ చైన్ పంపిణీ, స్కేలబుల్ వినియోగం నమూనాలకి విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి లోకేశ్ వివరించారు. భారత్‌లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీరంగంలో విస్తృతి, ఖర్చు విషయంలో పోటీతత్వం ఉన్నాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక ఇన్‌ఫ్రా, పోర్ట్స్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇది భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు ఒక చరిత్రాత్మక
అవకాశాన్ని కల్పిస్తుందని
తెలిపారు. ఏపీకి అనేక అదనపు ప్రయోజనాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. తమకు సువిశాలమైన తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విస్తతమైన పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్ఠాత్మకమైన పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉందని చెప్పుకొచ్చారు. పర్యావరణ వ్యవస్థ ఆలోచనా విధానం ముఖ్యమని అన్నారు. సాంకేతిక సహకారాలు, తయారీ భాగస్వామ్యాలు, సప్లై చైన్ అభివృద్ధి, ఇంజనీరింగ్ ఎకోసిస్టమ్స్, రీసెర్చ్ భాగస్వామ్యాలు, స్కిల్లింగ్, వర్క్‌ఫోర్స్ అభివృద్ధి, పారిశ్రామిక ప్రమాణాలు, భవిష్యత్తు సాంకేతికల అమలుకు విశ్వసనీయ గ్లోబల్ భాగస్వాములతో పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.



2లో..

## ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉండండి

జూన్ 1నుంచి కాలువల్లోకి నీరు విడుదల

రైతులకు మంత్రులు అచ్చన్న, రామానాయుడు భరోసా

## అమృత్ పథకంతో ఇంటింటికీ మంచినీరు

రెండేళ్లలో అన్ని ఇళ్లకు తాగునీటి వసతి

పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి

నెల్లూరులోని 54వ డివిజన్‌లో 350 కిలోలీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకు పనులకు నారాయణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గందరగోళం చేసి వెళ్లారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా.. కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో రాజీపడట్లేదు.



2లో..



2లో..

## కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం

ఆయనతోపాటు 20 మంది మంత్రులకు ఛాన్స్

హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి

కేరళంలోనూ మహిళలకు ఉచిత బస్సు

సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక విభాగం

ఆశావర్కర్ల గౌరవ వేతనం 3వేలకు పెంపు

కేరళం సిఎం సతీశన్ కీలక నిర్ణయాలు

ఉద్యోగాలు చేసే మహిళలు, విద్యార్థినులు, రోజువారీ ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయనున్నట్టు కూడా ప్రకటించారు. వృద్ధతరం పెరుగుతుండటం, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.



2లో..

## మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం

ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు

నార్వే పర్యటనలో ప్రధాని మోడీ కీలక ప్రకటన

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్-యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్-ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.



2లో..

## ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' కీలకం

తక్షణం స్పందిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం

మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి

# నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

కృషి చేసిన పోలీస్ అధికారులను సన్మానం

వారి కృషి అసామాన్యమని మంత్రి అమిత్ షా కితాబు

రాయ్‌పూర్: దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గడ్ లోని జగదల్పూర్ లో సోమవారం నాడు తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను ఆయన సన్మానించారు .తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంను ప్రస్తావించారు. ఈ సందర్భంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు,మాజీ డిజిపి బి.శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్ / గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ / మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్ఐబీ బృందాన్ని అమిత్ షా సత్కరించి, వారి విశేష సేవలను అభినందించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ..



జనవరి 2024లో ఒక అంతర్గత సమావేశంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని తాము కాలపరిమితిని నిర్దేశిరచు కున్నట్లు వెల్లడించారు.మేం ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలామంది ప్రైవేట్ చర్చల్లో ఇది సాధ్యం కాదంటూ సందేహాలు వ్యక్తం చేశారు. కానీ మేం స్పష్టమైన ప్రణాళికతో, పక్కా వ్యూహంతో ముందుకు సాగాం. మా దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ఈ రోజు బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి విముక్తి పొందిందని, వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటంలో ఇదొక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన కొనియాడారు.

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం



2లో..

ట్రక్కును ఢీకొన్న కంటెయినర్..

పదిమంది మృతి

ఘటనాస్థలిలోనే పదిమందికి పైగా మృతిచెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు.

# కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం

తిరువనంతపురం: కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్‌ఫోలియోలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్‌తో పాటు హోం శాఖ బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవెన్యూశాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. అందుకే ప్రస్తుతం సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఎమ్మెల్యేలు, ప్రజలు సతీశన్‌కే మద్దతు ఇచ్చారు.

## అమృత్ పథకంతో ఇంటింటికీ మంచినీరు

నెల్లూరు: రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నదీజలాలను అందిస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. రాష్ట్రంలో రూ.14 వేల కోట్లతో అమృత్ పథకం కింద పనులు జరుగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. నెల్లూరులోని 54వ డివిజన్‌లో 350 కిలోలీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకు పనులకు నారాయణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా

ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గందరగోళం చేసి వెళ్లారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా.. కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో రాజీపడట్లేదు. సీఎం చంద్రబాబు ప్రజారంజక పాలన అందిస్తున్నారు. ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం. పీ4 ద్వారా పేదలకు చేయూతనిచ్చేందుకు నా వంతు కృషి చేస్తున్నా. పేదరిక నిర్మూలన.. విద్యాభివృద్ధితోనే సాధ్యం అని నారాయణ తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని అన్నారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడంతో పాటు, పేదలకు పథకాలను అందచేస్తున్నామని అన్నారు. ఇకపోతే అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు.

# ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం




హైదరాబాద్: ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నె÷-లకెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ÷-రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గో÷-డలెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి?కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్‌స్టలెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్, ÷ర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ , రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ , హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మాక్ డ్రిల్‌ను విజయవంతం చేశారు.

# ఖరీఫ్ సాగుకు సిద్దంగా ఉండండి



అమరావతి: రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉండాలని, జూన్ 1 నుంచి కాలువల్లోకి సాగునీరు విడుదల చేస్తామని మంత్రులు ప్రకటించారు. ఖరీఫ్-2026 సాగునీటి విడుదలపై మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. కాలువల్లో పూడిక తొలగింపు పనులను మే చివరికి పూర్తి చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. గత సీజన్‌లో 2025-26 ఖరీఫ్‌లో 99.35 లక్షల ఎకరాలకు 888 టీఎంసీల నీటి సరఫరా చేశామని, రబీ సీజన్‌లో 23.67 లక్షల ఎకరాలకు 153 టీఎంసీల నీరు అందించామని మంత్రులు తెలిపారు. రాష్ట్ర రిజర్వాయర్లలో 461 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని వెల్లడించారు. గోదావరి డెల్టాకు జూన్ 1 నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు మంత్రులు ప్రకటించారు. కృష్ణా డెల్టాకు జూలై 1 నుంచి, నాగార్జున సాగర్ ఆయకట్టుకు జూలై చివరికి, కె.సి. కెనాల్‌కు జూలై 15 నుంచి, వంశధార ఆయకట్టుకు జూన్ 15 నుంచి సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు వర్చువల్ మీటింగ్ నిర్వహించారు. ఖరీఫ్-2026 ప్రణాళికలు, ఎల్ నినో ప్రభావంపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఎరువులు పక్కదారి పడితే అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. యూరియా సరఫరా కోసం రైతులకు ప్రత్యేక కార్డులు అందజేస్తామని, అవసరం మేరకు ఆ కార్డు ద్వారా యూరియా తీసుకోవచ్చని తెలిపారు. ముందస్తు నిల్వలు వద్దని, రెండు-మూడు దశల్లో నానో యూరియా వినియోగించాలని సూచించారు. యుద్ధం కారణంగా యూరియా దిగుమతులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, అందువల్ల యూరియాను అవసరం మేరకు మాత్రమే వాడాలని రైతులకు అచ్చెన్నాయుడు సూచించారు. ఐదేళ్లూ అధికారంలో ఉండి రైతాంగాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ పాలకులు ఇప్పుడు రైతులపై సానుభూతితో మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 'వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిన్నది. రైతులకు సరైన సమయంలో విత్తనాలు, ఎరువులు అందక ఇబ్బంది పడ్డారు. పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టపోయారు. రైతు భరోసా పేరుతో చెప్పినంత ఇవ్వకుండా మోసం చేశారని మంత్రి పేర్కొన్నారు. మామిడి రైతుల సమస్యలపై మాట్లాడే ముందు వైసీపీ హయాంలో ఉద్యాన రైతులు ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకోవాలన్నారు. వైసీపీ పాలనలో మొక్కజొన్న రైతుల పరిస్థితి దారుణంగా లేదా? కనీస మద్దతు ధర అమలులో విఫలం కాలేదా? రైతులు రోడ్లపై ఆందోళన చేసినా

వైసీపీ ప్రభుత్వం పట్టించుకుందా? కేవలం ప్రచార రాజకీయాలు తప్ప.. రైతు సంక్షేమం పట్టించుకున్నారా?

అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు సంబంధించిన ప్రతి అంశంపైనా సమీక్ష చేస్తున్నాం. నిజంగా రైతుల కోసం పని చేయాలనే ఉద్దేశం వైసీపీ నేతలకు ఉంటే చౌక బారు విమర్శలు మానాలని హితవు పలికారు.

# మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం



న్యూఢిల్లీ: భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు.పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్-యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్-ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్-నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇస్రో-నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య ఒప్పందం కుదిరిందని, పరిశోధనల కోసం నార్వే సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. నార్వే సంస్థలు భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఆహ్వానించారు. అలాగే ఆర్కిటిక్ పరిశోధనలు, అంతరిక్ష రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా భారత్-నార్వే కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు.

# మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు



హైదరాబాద్:మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావని, అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్ లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు లేని కాలంలో అద్భుతమైన కట్టడాలను మన పూర్వీకులు నిర్మించారని, వాటిని చూసి తరించక పోతే జీవితం సంపూర్ణం కాదని తెలిపారు. ÷ూమప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్ లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరల్డ్ మన్యూమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ షాలిని భూపాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కేంద్ర పురావస్తు శాఖ సూపరి÷-టనెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ (ఎఔ÷ంఅఊ) కన్వీనర్ అనురాధ రెడ్డి, చరిత్రకారులు డా. ఈమని శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం

### మత ఆధారిత సంక్షేమ పథకాలు రద్దు

### ఇమామ్‌లు, పూజరులకు గౌరవ వేతనం రద్దు

### అన్నపూర్ణ పథకం కింద అర్హులైన మహిళలకు 3వేల సాయం

కోల్‌కతా: సువేందు అధికారి నేతృత్వంలోని వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సోమవారం సీఎం సువేందు అధికారి అధ్యక్షతన బెంగాల్ కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను నిలిపివేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. 2026, జూన్ నుంచి ఈ పథకాలు నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సంక్షేమ కార్యక్రమాలకు మతం రంగు పులమకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని గత టీఎంసీ సర్కార్ ఇమామ్‌లు, ముఅజ్జిన్‌లు, ఆలయ పూజారులకు నెలవారీ గౌరవ వేతనాన్ని అందించిన విషయం తెలిసిందే. పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ఉన్న ఇమామ్‌లకు ప్రభుత్వం నెలవారీ గౌరవ వేతనాన్ని అందించింది. ఈ పథకం కింద ఆర్థికంగా బలహీన వర్గాల నుంచి వచ్చిన ఇమామ్‌లు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందజేసేవారు. అలాగే, మసీదులలో భక్తులను ప్రార్థనకు పిలిచే ముఅజ్జిన్‌లకు కూడా ఇదే విధమైన ఆర్థిక సహాయ అందించారు. ఈ రెండు పథకాలకు నిధులనూ మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి ఇచ్చేవారు. పంపిణీ చేశారు. ఇమామ్‌ల మాదిరిగానే హిందూ పూజారులు లేదా పురోహితుల కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. ఈ పథకం కింద ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన పురోహితులు నెలకు రూ.2 వేల గౌరవ వేతనాన్ని అందుకున్నారు. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ

ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఘోర పరాజయం పాలైంది. దీంతో బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సువేందు అధికారి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే గత టీఎంసీ సర్కార్ అమలు చేసిన మత ఆధారిత సంక్షేమ పథకాలను సువేందు అధికారి రద్దు చేశారు. ఇకపోతే బీజేపీ ప్రభుత్వం పలు ఇతర సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై నిర్ణయం తీసుకుంది.క్యాబినెట్ భేటీలో ప్రధానంగా ఐదు కీలక అంశాలపై చర్చ జరిపి, ఆమోదం తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి 'అన్నపూర్ణ' పథకం అమలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.

ఈ పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే, ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు జూన్ 1వ తేదీ నుంచి ఉచిత ప్రయాణం కల్పిస్తారు. ఇక, ప్రభుత్వ ఉద్యోగుల కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక ఆరోగ్య రంగంలో కూడా పెద్ద మార్పులు తీసుకురానున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. పీఎం విశ్వకర్మ, పీఎమ్ ఫసల్ బీమా యోజన, పీఎం శ్రీస్కూల్స్ వంటి కేంద్ర పథకాలను కూడా పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

# పోలీస్ సిబ్బంది పిల్లల విద్యా ప్రతిభకు ఘన సన్మానం

పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, నగదు బహుమతుల ప్రదానంవిద్యార్థుల కృషిని అభినందించిన రాష్ట్ర మంత్రులు, జిల్లా అధికారులుఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచన

**శ్రీకాళహస్తి, ఉత్తేజిత మే 18:**



ఇటీవల నిర్వహించిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించిన పోలీస్ సిబ్బంది పిల్లలను, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక శాసన సభ్యులు బొజ్జల సుదీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడులు ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా 10 వ తరగతి, ఇంటర్మీడియేట పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, నగదు బహుమతులను అందజేసి వారి కృషిని అభినందించారు. పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో తీరికలేని పరిస్థితి ఉన్నప్పటికీ, తమ పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడుతూ వారికి మంచి విద్య అందిస్తున్నారని కొనియాడారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో ఉత్తమ విద్యా బోధన విధానాలు ప్రవేశ పెట్టారని, తద్వారా ప్రభుత్వ విద్యా సంస్థల్లోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు సాధించిన విజయాలు వారి తల్లిదండ్రులకు గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లు విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. పోలీస్ కుటుంబాలకు చెందిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షిస్తూ వారికి అవసరమైన ప్రోత్సాహం ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేంపెంట గ్రామంలో గోకులం షెడ్ నిర్మాణానికి భూమి పూజ చేసిన మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ

**ఆత్మకూరు ఉత్తేజిత**



పాములపాడు మండలంలోని,వేంపెంట గ్రామంలో గోకులం షెడ్ నిర్మాణానికి మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ భూమి పూజ చేసి, కొబ్బరికాయ కొట్టి, ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ మాట్లాడుతూ వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఈ షెడ్ పశువులకు ఎండ, వర్షం నుండి రక్షణగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పశువులు ఉండే ప్రదేశాలు కూడా పరిశుభ్రంగా ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో వేంపెంట గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ రవి శంకర్, పంచాయతీ సెక్రటరీ పుల్లయ్య, టెక్నికల్ అసిస్టెంట్ కిరణ్, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ (డీసీ) ఆల్ఫ్రెడ్, మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, మాజీ ఎంపీటీసీ శివకుమార్, బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, కుటుంబరావు, రత్నాకర్, బోనాల భాస్కర్, జీవన్న, సుబ్బారావు, ఆంథోనీ, చిట్టిబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## దూదేకుల సంఘం ప్రజలకు వాటర్ బాటిల్ పంపిణీ




**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మే 18 :**

దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్ స్ భాజీ ఆదేశాల మేరకు నందికొట్కూరు పట్టణంలోని పటేల్ సెంటర్ కూడలిలో దూదేకుల సంఘం తరపున దూదేకుల ఖాజావాలి(బిజిలి )ఆధ్వర్యంలో ఉచిత వాటర్ బాటిల్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందికొట్కూరు పట్టణ ఎస్.ఐ.లు చంద్రశేఖర్ హాజరయ్యారు. వారి చేతుల మీదుగా ప్రజలకు పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో లో ఎండ వేడి ఎక్కువగా ఉందని,పట్టణానికి చుట్టు పక్కన గ్రామాల నుండి చాలా మంది ప్రజలు వస్తుంటారని,వారికీ దాదాపుగా 400 వాటర్ బాటిల్స్ ని ఉచితంగా అందించటం సంతోషమని, ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథం తో స్పందించాలని, సమాజానికి మన వంతు గా సహాయం చేయాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మాభాష, మాజీ కౌన్సిలర్ చాంద్ భాషా, పట్టణ అధ్యక్షులు బాబు,నందికొట్కూరు సోషల్ మీడియా ఇంచార్జి మహమ్మద్ హుస్సేన్,ల్ ఐ సి హుస్సేన్, పట్టణ యూత్ అధ్యక్షులు మన్సూర్, ఇస్మాయిల్, మౌలాలి, జంగిల్ సాహెబ్, బాబు,చాంద్,మరియు సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 301 అర్జీలు

పిజిఆర్ఎస్ అర్జీలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలి

:జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి, స్టాఫ్ రిపోర్టర్ ఉత్తేజిత మే 18**



: పిజిఆర్ఎస్ అర్జీలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో డి.ఆర్.ఓ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీజిఆర్ఎస్ లో వచ్చు అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, డి ఆర్ ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్ మాండ్ లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు: రెవెన్యూ-190, రూరల్ పావర్టీ-17, పంచాయతీ రాజ్ -16, సర్వే అండ్ ల్యాండ్-15, పోలీస్ -13, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-11, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ -5, స్కూల్ ఎడ్యుకేషన్ -4, రూరల్ డెవలప్మెంట్ -- 4, ఏ పి ఐ ఐ సి -- 3, గనులు భూ గర్భ వనరులు -2, పబ్లిక్ హెల్త్ -2, మత్స్య శాఖ -2, తుడా -2, ఎం జే పి ఏ పి బి బి సి డబ్ల్యు ఎడ్యుకేషన్ సొసైటి -2, వాటర్ రిసోర్సెస్ -2, ఏ పి ఎస్ ఆర్ టి సి -1, ఏ పి టౌన్ షిప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ -1, సోషల్ వెల్ఫేర్ - 1, పశు సంవర్ధక శాఖ -1, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు -1, సివిల్ సప్లై -1, ఏ పి ఎస్ సి సి ఎఫ్ టి -- 1, విద్యుత్ శాఖ -1, స్కిల్ డెవలప్మెంట్ -1 , టూరిజం -1, సెకండరీ హెల్త్ --మొత్తం 301 అర్జీలు రావడం జరిగిందని, సంబంధిత అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# సంక్షోభాల సృష్టికర్తలు...మన పాలకులు !

ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఓ సంక్షోభం వస్తూనే ఉంటుంది. ఇరాన్ సంక్షోభం ఇంకా ముగియలేదు. ట్రంప్ మరోమారు రంకెలు వేస్తున్నారు. బాంబులు వేస్తామని బెదిరిస్తున్నారు. ఇదే జరిగితే మరింత ఆర్థిక సంక్షోభం తప్పేలా లేదు. ఈ సంక్షోభాలకు భయపడి సంసారం చేద్దామ లేక ఇల్లు చక్కబెట్టుకుందామా అన్నది పాలకులు ఆలోచన చేయాలి. ముఖ్యంగా ప్రధాని మోడీ ఆర్థిక చర్యలు దిద్దుబాటు లాగా లేవు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన వేళ కేవలం కాన్వాయ్‌లో కార్లు తగ్గించడంతో సరిపెట్టేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్త చిన్నాభిన్నం అవుతోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోంది. సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. వేలకోట్లు వడ్డీలు కట్టడానికే వెచ్చిస్తున్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలు ముందు న్నాయి. అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేస్తున్నారు. ఇంట్లోకి వెళ్లి వండిపెట్టడమే తరువాయి అన్నట్లుగా పథకాలను వండి వారుస్తున్నారు. దీంతో ప్రభుత్వాన్ని నడపడానికి నిత్యం అప్పులు చేయడం, ఉన్న భూములను అమ్మేయడం అలవాటు చేసుకున్నారు. ఓట్ల కోసం నానాగడ్డి కరుస్తారనడానికి ఈ పథకాలే నిదర్శనం. ఇకపోతే పొదుపు విషయంలో ప్రజాప్రతినిధులకు లెక్కేలేదు. గతంలో మంత్రులు, ముఖ్యమంత్రులు సాధారణ ప్రజల్లాగా విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. హెలికాప్టర్లకు కొదవే లేదు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అత్యవసరంగా వెళ్లడానికి వేరు. కానీ ప్రతి కార్యక్రమం కోసం విమానాలు, హెలికాప్టర్లు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చంద్రబాబు అయితే స్వచ్ఛాంధ్ర, పెన్షన్ల పంపిణీకి చేస్తున్న ఆర్భాటం అంతాఇంతాకాదు. వీటికి వెళ్లకుండా కార్యక్రమాలను నడిపించేవచ్చు. కానీ ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడం కోసం నానా తంటాలు పడుతుంటారు. ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలకు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటన్నది బాబు చెప్పాలి. అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారన్నది తెలియదు. అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని ఊరేగుతున్నారు. మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు. ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మూడు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమయ్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారని కేంద్రమే ప్రకటించింది. అయినా భద్రతను కుదించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు ఆదర్శమని చెప్పాల్సిందే. హంగూ ఆర్భాటంలో ఆయన ముందుంటారు. ఆయిల్ సంక్షోభంతో ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ అడుగు ముందుకేసి మరింత జాగ్రత్తలు చేపట్టారు. మహానాడును సైతం వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయించారు. ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అయితే తమ కార్యక్రమాల్లో పొదుపు పాటించి, దుబారా ఖర్చులు తగ్గించుకోగలిగితే మంచిదే. కానీ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలలో దుబారా సర్వసాధారణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు హంగూ ఆర్భాటం పెరిగింది. దుబారా అని ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు. ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నది కనిపించడం లేదు. మితిమీరిన ఖర్చులతో రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టేసారు. జగన్ ఉండగా అంతకు మించి అన్నట్లుగా డబ్బులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. విశాఖలో అత్యాధునిక గెస్ట్ హౌజ్‌లు కట్టుకున్నారు. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా మందీ మార్బలంతో పాటు, భారీ కాన్వాయ్‌లతో వెళుతుంటారు. ఇలా అప్పులు కావడానికి పాలకులు తీరు కారణం. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా సంక్షేమ పథకాలతో వారిని నిర్వీర్యులను చేస్తున్నారు. రూపాయికే కిలో బియ్యం, ఉచిత సిలిండర్, ఉచిత కరెంట్, ఉచితంగా చీరలువంటి సంక్షేమ పథకాల అవసరమా అని ఆలోచించడం లేదు. ఉత్పాదక సాధించి, ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించాల్సింది పోయి అనుత్పాదక వ్యయం వైపు దేశంతో పాటు ప్రజలను మళ్లించడం ఏ తరహా అభివృద్ది అన్నది పాలకులు చెప్పాలి. ప్రభుత్వాలు లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎందుకో ప్రజలకు జవాబు ఇవ్వాలి. బడా పారిశ్రామికవేత్తలు అప్పులు ఎగవేస్తున్నా ఎందుకు చోద్యం చూస్తున్నారో చెప్పాలి. ఇవన్నీ సవరించుకో నంతవరకు దేశంలో అప్పులమీద ఆధారపడాల్సిందే. పాలకుల తీరు మారాలి. ప్రజలతీరూ మారాలి. కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు అని గుర్తించాలి.

# వేటకు విరామం... సర్కారు సాయం

గంగపుత్రులకు రెండో ఏడాది అండగా ప్రజాప్రభుత్వం

'మత్స్యకారుల సేవలో' కింద ప్రతీ కుటుంబానికి రూ.20 వేలు జమ

1.30 లక్షల కుటుంబాలకు రూ.262 కోట్లు లబ్ది

కావలిలో రేపు నిధులు విడుదల కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, మే 18 : ఆంధ్రప్రదేశ్‌లోని మత్స్యకారుల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. వేట నిషేధ కాలంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా మత్స్యకారులను ఆదుకునేందుకు అమలు చేస్తోన్న 'మత్స్యకారుల సేవలో' పథకం కింద వరుసగా రెండో ఏడాది ఆర్థిక సాయం అందించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయనుంది. నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు విడుదల చేయనున్నారు. ప్రతీ ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు... 61 రోజుల పాటు సముద్రంలో చేపలు పిల్లలు పెట్టే సమయంలో వేటకు విరామం ఉంటుంది. ఈ సమయంలో మత్స్యకారుల జీవనానికి ఇబ్బంది లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది.

**రెండేళ్లలోనే రూ.505 కోట్ల సాయం**

వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేలు ఆర్థికసాయం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. హామీ ఇచ్చినట్టుగానే గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్లు సాయం అందించగా... ఈ ఏడాది 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. ఈ ఏడాది లబ్ధిదారు కుటుంబాల సంఖ్య కూడా పెరిగింది. రెండేళ్లలోనే మత్స్యకారుల కుటుంబాలకు వేట నిషేధ సమయంలో రూ.505 కోట్లను సాయంగా అందించింది. గత ప్రభుత్వం మత్స్యకారులకు కేవలం రూ.10 వేల సాయాన్ని మాత్రమే అందించింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ బలహీన వర్గాల సంక్షేమానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ సాయాన్ని రూ.20,000 పెంచుతూ ప్రజా ప్రభుత్వం బాసటగా నిలిచింది. వరుసగా రెండో ఏడాది ఇవ్వడంతో పాటు లబ్ధిదారుల సంఖ్యను పెంచి నిధులు విడుదల చేయడం ద్వారా మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టమవుతోంది.

**సకాలంలో పరిహారం... కుటుంబాలకు సహకారం**

వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వేట సమయంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు పరిహారం సకాలంలోనే అందిస్తోంది. 2024-25లో 63 క్లైయిమ్స్‌కు రూ.3.15 కోట్లు, 2025-26లో 113 పెండింగ్ క్లైయిమ్స్‌కు రూ.5.65 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. అంతేకాకుండా వారి ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం సీవీడ్ సాగును ప్రోత్సహిస్తోంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 09.30 గంటలకు అమరావతి క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 10.30 గంటలకు కావలి మండలం తుమ్మలపెంటకు చేరుకుంటారు. 10.45 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. నిధులు విడుదల చేస్తారు. మధ్యాహ్నం 01.15 గంటలకు గ్రామంలోని మత్స్యకార కుటుంబాలతో భేటీ అవుతారు. 2 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.

# పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి ప్రజలపై బారాలు వేస్తున్న మోడీ విధానాలను వ్యతిరేకించండి :

**ఆత్మకూరు ఉత్తేజిత**



సిఐటియు
కొత్తపల్లి: పెట్రోల్ డీజిల్ 100 గ్యాస్ ఎరువుల ధరలు పెంచుతూ ప్రజలపై ధరల బారాన్ని మోపుతున్న మోడీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వ్యతిరేకించారని సి ఐ టి యు మండల కార్యదర్శి కే దినేష్ సిపిఎం మండల కార్యదర్శి ఎన్ స్వాములు పిలుపునిచ్చారు సోమవారం నాడు పెట్రోల్ డీజిల్ ధరలకు వ్యతిరేకంగా కొత్తపల్లి మండల కేంద్రంలో ఆటోను తాళ్ళకు కట్టి లాగి నిరసన తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుద్ధాన్ని సాకుగా చూపి అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరుగుతున్నాయి అంటూ నరేంద్ర మోడీ ప్రభుత్వం డిజిల్ పైన 3.14 రూపాయలుపెట్రోల్ పైన3.29 రూపాయలు ధరలు పెంచి ప్రజలపై భారాలను మోపింది ఎప్పటికే వంట గ్యాస్ సిలిండర్ల ధరలు ఎరువుల ధరలు విపరీతంగా పెంచిన మోడీ ప్రభుత్వం తాజాగా పెంచిన పెట్రోల్ డీజిల్ ధరల వల్ల సామాన్యులపై మరింత భారం పడుతుందని అన్నారు ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు కేంద్ర మంత్రులు పెరిగినప్పటికీ భారత దేశంలో పెట్రోల్ డీజిల్ ధరలు పెంచబోమని చెప్పి ఎన్నికల అయిపోయిన మరుక్షణమే పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు గతంలో బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 142 డాలర్లు ఉన్నప్పుడు లీటర్ పెట్రోల్ 60 రూపాయలు ఉండేది తగ్గినప్పుడు కూడా ధరలు తగ్గించకుండా మనదేశంలో పెట్రోల్ డీజిల్ ధరలు పెంచారు పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరల వల్ల రవాణా ఖర్చులు ఎరువుల ధరలు నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరుగుతాయని సామాన్య మధ్యతరగతి ప్రజలు కూడా ఈ ధరల భారాన్ని తట్టుకోవడం కష్టంగా ఉంటుందన్నారు కేంద్ర ప్రభుత్వం ఎప్పటికైనా పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలు వెంటనే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎన్ దాసు దేవకుమార్ పవన్ ఆటో యూనియన్ నాయకులు శంకర్ రెడ్డి నాయక్ రవి తదితరులు పాల్గొన్నారు

# రుయా ఆసుపత్రి యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షులుగా సి. మధుబాబు -- ప్రధాన కార్యదర్శిగా ఏ. నరసింహులు -- కోశాధికారిగా ఏ. దయాసాగర్ ఎన్నిక**

**తిరుపతి ఉత్తేజిత మే 18.**



నేడు తిరుపతిలోని రుయా ఆసుపత్రి ప్రాంగణంలోని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధ కార్యాలయంలో యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. వేణుగోపాల్ హాజరై కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆసుపత్రిలో పని పరిస్థితులు, సిబ్బంది కొరత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రుయా ఆసుపత్రి యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా సి. మధుబాబు, ప్రధాన కార్యదర్శిగా ఏ. నరసింహులు, కోశాధికారిగా ఏ. దయాసాగర్ ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా కందారపు మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె. వేణుగోపాల్, గౌరవ సలహాదారులుగా బి. గురవయ్య, కార్యదర్శిగా రమేష్‌తో పాటు మరో 11 మందిని నూతన ఆఫీస్ బేరర్లుగా ఎన్నుకోవడం జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన కె. వేణుగోపాల్, సుమారు 1600 పడకల సామర్థ్యం కలిగిన రాయలసీమ జిల్లాలకు ప్రామాణిక వైద్య సేవలు అందిస్తున్న అతిపెద్ద ఆసుపత్రి అయిన రుయాలో ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓల కొరత తీవ్రంగా ఉందన్నారు. తగిన సిబ్బంది లేకపోవడంతో కేవలం 83 మంది ఉద్యోగులతోనే భారీ పనిభారం మోపుతున్నారని, దీనివల్ల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో అవసరమైన మేరకు సిబ్బంది నియామకాలు చేపట్టి కార్మికులపై పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, సిబ్బంది పెంపు, పని పరిస్థితుల మెరుగుదల కోసం నూతన కమిటీ రాజీలేని పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమిస్తూ యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. యూనియన్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఈ నూతన నాయకత్వం కార్మిక సమస్యలపై మరింత సమర్థవంతంగా పోరాడి న్యాయమైన డిమాండ్ల సాధనలో ముందుంటుందని సీఐటీయూ ఆశాభావం వ్యక్తం చేసింది.

# ఎస్ ఎల్ వి బెంగళూరు అయ్యంగార్ బేకరీ యజమానంపై చర్యలు తీసుకుంటాం... ఫుడ్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్

**దేవనకొండ మే 18( ఉత్తేజిత)**







దేవనకొండ మండల కేంద్రంలో ఎస్ ఎల్ వి బెంగళూరు అయ్యంగార్ బేకరీ పై కర్నూలు జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్ రావు తనిఖీలు నిర్వహించారు. ఈనెల 16వ తారీకు శనివారం రోజున చిన్న అనే కస్టమర్ తన కుమారుడు బర్త్డే కోసం రెండు కేజీల కేకు కొనుగోలు చేశారు. తన కుటుంబంతో కలిసి బర్త్డే వేడుకలు జరుపుకుంటున్న కేక్ కట్ చేసి అందరికీ పంచి సగం కేకు తిన్న తర్వాత ఆ కేకు లో నుండి గుట్కా ప్యాకెట్ లభ్యమయ్యింది. వెంటనే ఆ కేకును తీసుకొని బేకరీ యజమాని దగ్గరికి వెళ్లి చూపించగా తప్పయింది ఇంకోసారి ఇలా జరుగుకుండా చూసుకుంటానని తెలియజేశాడు. కొనుగోలుదారుడు కంప్లీట్ మేరకు ఈరోజు సోమవారం ఎస్ ఎల్ వి బెంగళూరు అయ్యంగార్ బేకరీ నీ తనిఖీ చేయడం జరిగిందని, ఈ తనిఖీ లో భాగంగా ఈ బేకరీ షాపులో డేటు అయిపోయిన ఐస్ క్రీములు, దొరకాయని అలాగే కేకులు మీద వేసే క్రీములు, కలర్స్ వివిధమైనవి దొరకడంతో వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసుకున్నామని తెలియజేశారు. ఈ సీజ్ చేసిన ఆహార వస్తువులు ల్యాబ్ కు పంపించి ల్యాబ్ రిపోర్ట్ వచ్చిన తర్వాత పూర్తి యాక్షన్ తీసుకుంటామని ఇప్పుడు దొరికిన వాటిలో డేట్ అయిపోయిన వస్తువులపై వెంటనే జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కేసు నమోదు అవుతుందని అలాగే బర్త్డే కేక్ లో గుట్కా వచ్చినందుకు దాని మీద కూడా కేసు అవుతుందని తెలియజేశారు. ఈ షాప్ కు ఫుడ్ లైసెన్స్ కూడా లేదు అని 16వ తారీకు జరిగితే 17వ తారీఖున ఫుడ్ లైసెన్స్ సర్టిఫికేట్ తీసుకున్నాడని తెలిపారు. ప్రజలు, పిల్లలు చాలా ఇష్టంగా తినే ఈ బేకరీ ఫుడ్ లో ఇలాంటి నిషేధిత గుట్కా ప్యాకెట్లు రావడం చాలా బాధాకరమని యజమాని నిర్లక్ష్యం దీనికి కారణమని ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశాడు.

# పెట్రోల్ డీజిల్ పెంపుపై వైఎస్ఆర్సిపి ఆగ్రహం

**వైఎస్ఆర్సిపి శ్రేణులు విన్నుతనంగా ట్రాక్టర్ తాడు కట్టి లాగుతూ ర్యాలీ**

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మే 18:**



రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం తీవ్ర ఆందోళనకరమని నందికొట్కూరు వైఎస్ఆర్సిపి సమన్వయకర్త డా.సుదీర్ దారా మండిపడ్డారుకూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అనంతరం ఆదమర్చి సామాన్యుడి నడ్డి విరుస్తోందని ఆయన విమర్శించరాని రాస్తా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాల మేరకు పెరిగిన ధరలకు నిరసనగా డా.సుదీర్ దారా నందికొట్కూరు పటేల్ కూడలి నుండి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వరకు ట్రాక్టర్‌కు తాళ్లు కట్టి లాగుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపి పెరిగిన పెట్రోల్,డీజల్ పై ఆయిల్ బంక్ లో వినియోగదారులతో అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ దారా సుధీర్ మాట్లాడుతూ టీడీపీ మ్యానిఫెస్టోలో ధరలు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు పూర్తిగా విస్మరించడం ఎంతవరకు సమంజసమ న్నారు. దేశంలో పోలిస్తే ఏపీలోనే పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా పెరిగాయి అన్నారు. ధరల భారం రైతులు, రవాణా రంగం, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రంగా పడుతోంది. నిత్యావసర ధరలు కూడా పెరిగి ప్రజల జీవన వ్యయం పెరుగుతోందని ఆ గ్రామ చందారం. పెరిగిన పెట్రోల్,డీజల్ పై 35% వ్యాట్ ను తగ్గించి ప్రజలపై భారాన్ని చంద్రబాబు,పవన్ కళ్యాణ్, లోకేష్ పెరిగితే మాకు ఏమి సంబంధం లేదు అనడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర మంత్రి స్థానిక ఎమ్మెల్యే జయసూర్య పబ్లిసిటీ కోసం సైకిల్ మరియు బైక్ పై తిరగడం సోపుటబ్ కోసమే అన్నారు. నంద్యాల ఎంపీ శబరి పెట్రోల్,డీజల్ తగించేలా లోకసభలో ప్రస్తావ చేసి సామాన్య ప్రజలపై పడే భారాన్ని తగ్గించాలని కోరారు. చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన హామీ మేరకు పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డా.సుదీర్ దారా డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వో కు వైసీపీ శ్రేణులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూర్ వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షులు మన్సూర్ వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు,ప్రజా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో రూ. 2.75 కోట్లతో నిర్మించిన 'స్మార్ట్ పోలీస్ స్టేషన్' ప్రారంభం

**శ్రీకాళహస్తి ఉత్తేజిత మే 18.**



ప్రఖ్యాత ఆధ్యాత్మిక క్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు ప్రజల భద్రత కోసం కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. సుమారు లక్షకు పైగా జనాభా కలిగిన టెంపుల్ టౌన్‌లో ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు, లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణకు అత్యాధునిక వసతులతో నిర్మించిన టూ టౌన్ 'స్మార్ట్ పోలీస్ స్టేషన్' నూతన భవనాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు.

?ప్రభుత్వ ప్రత్యేక చొరవ
గతంలో అద్దె భవనాల్లో కొనసాగుతూ, ప్రజలకు మరియు పోలీసు సిబ్బందికి ఇబ్బందిగా మారిన టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమస్యపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక దృష్టి సారించింది. గౌరవ ముఖ్యమంత్రి దూరదృష్టితో, రూ. 2.75 కోట్ల వ్యయంతో ఈ నూతన భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

?మంత్రుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం
రాష్ట్ర హోమ్ మంత్రి వర్యులు వంగలపూడి అనిత, జిల్లా ఇంచార్జ్ మరియు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ అభ్యున్నతికి మరియు ప్రజల రక్షణకు తమ ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

ఈ స్మార్ట్ పోలీస్ స్టేషన్ పూర్తిగా అత్యాధునిక సాంకేతికతతో పనిచేస్తుంది. ఫిర్యాదుల నమోదు నుంచి కేసుల పురోగతి వరకు అంతా ఆన్‌లైన్ చేయబడింది. ఒకే డిజిటల్
డ్యాష్ బోర్డు ద్వారా హోమ్ శాఖ మరియు ఎస్పీ స్థాయి అధికారులు నేరుగా పర్యవేక్షించేలా ఈ స్టేషన్‌ను తీర్చిదిద్దారు. దీనివల్ల గ్రామీణ పేదలకు, దేశవ్యాప్తంగా వచ్చే భక్తులకు పోలీసు సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయి.

?పాల్గొన్న ప్రముఖులు
ఈ ప్రారంభోత్సవ వేడుకలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్‌తో పాటు కూటమి ముఖ్య నాయకులు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి ఆలయంలో హోం మంత్రి వంగలపూడి అనితకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఘన స్వాగతం....

**శ్రీకాళహస్తి ఉత్తేజిత మే 18.**



తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ హోం మంత్రివర్యులు వంగలపూడి అనిత కి శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తీశ్వర ఆలయ ప్రాంగణంలో ఘనంగా స్వాగతం పలికారు.

?అనంతరం మంత్రి కి ఆలయంలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, ఎమ్మెల్యే గారు స్వయంగా దగ్గరుండి శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దివ్య దర్శనం చేయించారు. వేద పండితుల ఆశీర్వచనాల అనంతరం హోం మంత్రి కి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆ పరమశివుని కృపాకటాక్షాలతో రాష్ట్రం ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఎస్పీ , రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ , అధికారులు మరియు కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



**శ్రీకాళహస్తిలో మంత్రులను కలిసిన ఏర్పేడు టీడీపీ నేతలు...... పాపానాయుడుపేటకు 'అవుట్ పోలీస్ స్టేషన్' ఏర్పాటుపై వినతి....**

**ఏర్పేడు ఉత్తేజిత మే 18.**

ఏర్పేడు మండల పరిధిలోని ప్రజల భద్రత, పోలీస్ వ్యవస్థ బలోపేతంపై రాష్ట్ర మంత్రులకు వినతి పత్రం అందజేశారు. సోమవారం శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆహ్వానం మేరకు హోంమంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శ్రీకాళహస్తికి విచ్చేశారు.

?ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి నివాసంలో మంత్రులను ఏర్పేడు మండల సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ఏర్పేడు మండలంలోని పోలీస్ వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా పాపానాయుడుపేట ప్రాంతంలో పెరుగుతున్న జనాభా, అవసరాల దృష్ట్యా అక్కడ ఒక అవుట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని మంత్రులను కోరారు. అలాగే ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న సిబ్బంది కొరత వల్ల శాంతిభద్రతల పరిరక్షణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే సిబ్బంది సంఖ్యను పెంచాలని విన్నవించారు. నాయకుల అభ్యర్థనపై హోంమంత్రి అనిత, జిల్లా ఇన్చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ సానుకూలంగా స్పందించారు. శాంతిభద్రతలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, త్వరలోనే ఏర్పేడు మండల సమస్యలను పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు.

# రేణిగుంట విమానాశ్రయంలో జిల్లా ఇంచార్జి మంత్రికి ఘనస్వాగతం....

**రేణిగుంట, ఉత్తేజిత మే 18.**



రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి మరియు తిరుపతి జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ కు రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. సోమవారం ఉదయం విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన జిల్లా పర్యటనకు రావడంతో అధికారులు మరియు నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. విమానాశ్రయం నుండి మంత్రి తన పర్యటనలో భాగంగా నిర్ణీత కార్యక్రమాలకు బయలుదేరి వెళ్లారు.

# ఉపాధి హామీ పథకం పాత పద్ధతిల్లోనే కొనసాగించాలి

**: సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ డిమాండ్**

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మే 18:**



వికాషిత్ భారత్ జి రాంజీ పథకం రద్దు చేయాలి..? మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి.? జాతీయ ఉపాధి హామీ పథకం పని చేస్తున్న వ్యవసాయ కూలీలకు గడ్డపార పనిముట్లు పంపిణీ చేసి,పాత విధానాన్ని కొనసాగించాలని సి.పి.ఐ(ఎం.ఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిక్కిలి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.సోమవారం పగిడ్యాల మండలంలోని లక్ష్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అంచ వద్ద ఉన్న చెరువులో పని చేస్తున్న వ్యవసాయ కూలీలను కలిసి వారికున్న సమస్యల గురించి వివరంగా అడిగి తెలుసుకోవడం జరిగింది.అనంతరం సి.పి.ఐ(ఎం.ఎల్)లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఉపాధి హామీ పథకం పాత పద్ధతుల్లోనే కొనసాగించాలని తీర్మానం చేయాలని సి.పి.ఐ(ఎం.ఎల్)లిబరేషన్ డిమాండ్ చేశారు.నంద్యాల జిల్లా,నందికొట్కూరు నియోజకవర్గం ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని మంచినీటి సమస్య,మజ్జిగ,4 కిలోమీటర్లు నడిచి వస్తున్న వారికి రవాణా చార్జీలు ఇవ్వాలని,పేస్ యాప్ రద్దు చేయాలని,సరైన సమయంలో నెట్టు రాకపోవడంతో కొంతమంది కూలీలు వెనక్కి పోయే పరిస్థితి ఉందన్నారు.కూలీలు ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందన్నారుగత 10 సంవత్సరాల క్రిందట ఇచ్చినటువంటి గడ్డపారలు తప్ప ఇంతవరకు పనిముట్లు ఇవ్వలేదని ఆవేదన పడ్డారు ఉపాధి కూలీలకు ఉష్ణోగ్రత 45%శాతం ఉండడం వల్ల ఉపాధి కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.ఉపాధి కూలీలకు రోజు వారి కూలీ 600 రూపాయలు వేతనం కల్పించాలని 200 రోజులు పని కల్పించాలని వేసవిఅలవెన్స్ 30%ఇవ్వాలని ప్రతి ఉపాధి కూలీకి పదివేల రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించాలని పనిచోట ప్రమాదం లో చనిపోతే రూ 30 లక్షలు ఇవ్వాలని ప్రమాదంలో గాయపడిన రూ 5.లక్షలు ఇవ్వాలని వారికి వీటి సాధనకై ఈ పోరాటాల కొనసాగిస్తామని కూటమి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికల ఉద్యమం కొనసాగించడానికి సిద్ధమవుతామన్నారు.ఈ కార్యక్రమంలోఎం.సాములు,జి.జయరాజు,ఏం.సలీం,ఎం.విష్ణువర్ధన్,ఎస్.సలీం,ఎల్.రాజా గౌడ్,జి.నాగన్న,వై. సునీల్,వై.లోకన్నా, కే.ఏసేపు,వై.చక్రి,ఫిట్టర్ మాబు,కే.దావీదు,జి.రాజామని,ఎస్. వజీర్ భాష,ఎం.శ్రీనివాసులు,బి.గోకారి,పి.శేషన్న,ఏ.జానకి రామ్,ఏం.రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్‌గా, యాక్టివ్‌గా ఉంటారు..!



గృహిణులు శరీరానికి వ్యాయామం ఉండట్లేదని ఫీల్ అవుతూ ఉంటారు. రోజంతా ఇంటిపనులతోనే సరిపోతుంది.. ఇక వ్యాయామాలని సమయం ఎలా కేటాయించాలని బాధపడుతూ ఉంటారు. అయితే.. ఇంటి పని చేస్తూ కూడా ఫిట్‌గా ఉండొచ్చని నిపుణులు అంటున్నారు. గిన్నెలు శుభ్రం చేసుకోవడం, బట్టలు ఉతకడం.. ఇంటిని క్లీన్ చేసుకోవడం.. ఇలా మనం చేసే ప్రతి పనీ మన శరీరానికి వ్యాయామంలా పని చేస్తాయని నిపుణులు అంటున్నారు.? తుడిస్తే.. వెన్నెముక స్ట్రాంగ్ అవుతుంది.. ఇల్లు ఊడవడం, తుడవడం.. లాంటి పనులంటే చాలామంది ఇట్రెస్ట్ చూపించరు. కానీ ఈ పనులు చేస్తే.. భుజాల్లోని కండరాల్లో కదలికలు జరిగి.. అవి మరింత దృఢమవుతాయి. అలాగే వెన్నెముక కూడా నిటారుగా ఉంటుంది. నిల్చొని చేస్తే.. కాళ్లు స్ట్రాంగ్ అవుతాయ్.. ఇంట్లో ఆడవాళ్లు ఎక్కువగా నిలబడే పనిచేస్తూ ఉంటారు. రోజంతా నిలబడి ఉంటే.. కాళ్లు లాగేస్తూ ఉంటాయి, లేదంటే 'నడుం నొప్పి వస్తుంది'. కొందరికైతే.. నీరసం కూడా వచ్చేస్తూ ఉంటుంది. ఇలా నిలబడి పనిచేస్తే..కాళ్లు, నడుం భాగంలోని కండరాలు దృఢమవుతాయని చెబుతున్నారు. షెల్ఫ్‌లు క్లీన్ చేస్తే.. ఇంట్లో ఉండే షెల్ఫ్‌లు, వస్తువులు శుభ్రం చేసేటప్పుడు మన భుజాలను పైకి, కిందికి కదపాల్సి ఉంటుంది. ఇలా చేయడం వల్ల భుజాల్లోని కండరాల్లో కదలికలు జరిగి అవి మరింత దృఢమవుతాయి. బట్టలు ఉతికి, ఆరేస్తే.. పొట్టలోని కండరాలకు మంచి వ్యాయామం అందుతుంది. అలాగే శరీరంలోని అనవసర క్యాలరీలు కూడా ఖర్చవుతాయి. కాబట్టి ఎప్పుడూ వాషింగ్ మెషీన్‌పై ఆధారపడకుండా.. అప్పుడప్పుడూ చేత్తో ఉతకడం అలవాటు చేసుకోండి. బట్టలు ఇంట్లోనే ఐరన్ చేసుకుంటే.. భుజాలు, కాళ్ల పిక్కల్లోని కండరాలకు వ్యాయామం అందుతుంది. బరువులెత్తితే.. మంచిదే.. ఇంటి పనుల్లో.. బరువులెత్తడం, వస్తువుల ను ఒకచోట నుంచి మరోచోటుకి మార్చడం కామన్. వీటి వల్ల కూడా శరీరానికి మంచి ఎక్సర్‌సైజ్ అందుతుంది. ఇలాంటి పనులు చేయడం వల్ల వెన్నెముక స్ట్రాంగ్ అవుతుంది. మోకాళ్ల సమస్యలూ రావు. అలాగే నడవడం, వంగడం లాంటివి చేస్తే.. నడుము స్ట్రాంగ్ అవుతుంది.






# ఆవనూనె ఇలా వాడితే గుండె, కీళ్ళ సమస్యలు దూరం..

చలికాలం వచ్చిందంటే మనం ప్రతి విషయాల్లోనూ మార్పులు చేయాలి. అలాంటి వాటిలో నూనె కూడా మార్చాలి. అందుకోసం ఆవ నూనె వాడడం మంచిది. ఆవాల నూనెతో ఉపయోగాలు ఆవాల నూనెతో ఉపయోగాలు చలికాలంలో ఉదయం ఎక్కువగా చలి ఉంటుంది. ఇది బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్స్ ఎక్కువగా స్ప్రెడ్ అవుతుంటాయి. ఇలాంటప్పుడు అనేక సమస్యలు వస్తాయి. వీటిని తగ్గించేందుకు మెడిసిన్ వాడతాం. అయితే, సమస్య వచ్చాక బాధపడే బదులు రాకముందే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచిది కదా. అందులో భాగంగా ఆవనూనె చాలా హెల్ప్ చేస్తుంది. దీనిని వాడితే అనేక సమస్యల నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చు. ఆయుర్వేదంలో ఆవనూనెలో ఎక్కువగా ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి మన బాడీకి విటమిన్ ఇ, మినరల్స్‌తో పాటు పోషకాలను అందిస్తాయి. చలికాలంలో ఆవనూనె తీసుకోవడం చాలా మంచిది. దీని వల్ల చాలా లాభాలు ఉన్నాయి.

గుండె ఆరోగ్యానికి.. ఆవాల నూనెలో ఒమేగా 3, ఒమేగా 6 మూలకాలు ఉన్నాయి. ఇవి శరీరంలో రక్త ప్రసరణ సులభతరం చేస్తాయి. రక్తపోటుని కంట్రోల్ చేయడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని పెంచుతుంది. కాబట్టి, చలికాలంలో వంటల్లో ఆవ నూనె వాడడం వల్ల గుండె సమస్యలు దూరమవుతాయి.

జలుబు, దగ్గు.. జలుబు, దగ్గు సమస్యలతో బాధపడేవారు ఆవ నూనె వాడడం వల్ల రిలీఫ్‌గా ఉంటుంది. ఇందుకోసం కొద్దిగా ఛాతీపై ఆవ నూనె వేసి రుద్దాలి. దీని వల్ల ఛాతీలో పేరుకుపోయిన కఫం తగ్గిపోతుంది. దీని వల్ల బాడీలోని అదనపు నీరు కూడా తగ్గిపోతుంది. చాలా మందికి జలుబు ఎక్కువై శ్వాస తీసుకోవడం కూడా ఇబ్బందిగా ఉంటుంది. అలాంటివారు ఆవ నూనె రాస్తే సమస్య తగ్గిపోతుంది. అదే విధంగా వేడి నీటిలో కొద్దిగా ఆవ నూనె వేసి ఆవిరిపట్టినా ప్రయోజనం ఉంటుంది.






కీళ్ళనొప్పులు.. కలికాలంలో కాళ్ళు, చేతుల నొప్పులు ఉంటాయి. అందుకోసం ఆవ నూనెని చేసి వంట చేస్తే ఎముకల సంబంధిత సమస్యల దూరమవుతాయి. దీనికోసం వెల్లుల్లిని ఆవా నూనెలో వేసి మరిగించి నొప్పి ఉన్న చోట మసాజ్ కూడా చేయొచ్చు.

ఆర్థరైటిస్.. చలికాలంలో ఎముకల సమస్యలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, గోరువెచ్చని ఆవ నూనెని మసాజ్ చేస్తే రక్త ప్రసరణ పెరిగి కీళ్ళనొప్పులు, తీవ్రంగా ఉండే నొప్పులు దూరమవుతాయి.

నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

# చలికాలంలో మీ గుండె జాగ్రత్త..!

శీతాకాలంలో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. వాతావరణ ఉష్ణోగ్రతలు వేగంగా తగ్గిపోవటానికీ, గుండె జబ్బులకీ మధ్య సంబంధం ఉందని స్వీడన్‌లోని లండ్ విశ్వవిద్యాలయం పరిశోధనలు స్పష్టం చేశాయి. చలికాలం హృదయ ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యంగా, ఇప్పటికే గుండె సమస్యలు ఉన్నవారు.. చాలా జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. ఈ సీజన్‌లో ఎక్కువగా కరోనరీ ఆర్టరీ డిసీజ్ ముప్పు పెరుగుతుంది. ఈ సీజన్‌లో గుండె సమస్యలు రావడానికి కారణాలు, లక్షణాలు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో హెూమియోపతి వైద్యురాలు వందనా గులాటీ మనకు వివరించారు.

గుండె సమస్యలు ఎందుకు వస్తాయి.. గుండె కండరాలకు రక్తాన్ని సరఫరా చేయడానికి బాధ్యత వహించే కొరోనరీ ధమనులు ఇరుకైనప్పుడు హార్ట్ బ్లాక్ ఏర్పడ్నుంది. సూర్మరశ్మి తక్కువగా ఉండటం, చల్లగాలులు తీవ్రంగా వీచటం, వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండటం.. ఇలాంటి పరిస్థితుల్లో మన శరీరంలో ఉష్ణోగ్రతను నెగ్గుకొచ్చే శక్తి తగ్గిపోయి.. ఆ ప్రభావం నేరుగా ఒంట్లోని అవయవాల మీద పడుతోంది. (థర్మల్ కండక్షన్). దీంతో రక్తనా ళాలు చలికి ప్రతిస్పందించి.. ధమనుల్లో రక్తపోటు పెరిగిపోయి.. తీవ్రమైన వణుకు, గుండెపోటు రావడానికి ఆస్కారం ఉంటోందని నిపుణులు అంటున్నారు. చల్లని వాతావరణంలో రక్తపోటు పెరుగుతుంది, ఇది గుండెపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది గుండె సమస్యలు ముప్పును పెంచుతుంది.






ఇవి తింటే.. గుండె సమస్యలు రావు..!

ఈ లక్షణాలు కనిపిస్తాయి..
ఛాతీ నొప్పి, అసౌకర్యం
తరచుగా ఛాతీ బిగుతుగా అనిపించడం, ఒత్తిడిగా అనిపించడం జరుగుతుంది.
శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
చిన్న పని చేసినా.. అలసటగా, బలహీనంగా అనిపిస్తుంది. గుండెకు రక్త ప్రసరణ తగ్గి.. మూర్ఛ, మైకము వస్తాయి.

వెచ్చగా ఉండండి..
ఈ సీజన్‌లో గుండె సమస్యలు, గుండె పోటు నుంచి రక్షణ పొందడానికి.. వెచ్చగా ఉండటం చాలా ముఖ్యం. మీరు వెచ్చగా ఉండటానికి ఉన్ని దుస్తులు ధరించండి. ఇవి చలి నుంచి.. రక్తనాళాలు కుంచించుకుపోకుండా నిరోధిస్తుంది.

రోజూ వ్యాయామం చేయండి..
గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, రోజూ వ్యాయామం చేయడం చాలా ముఖ్యం. వ్యాయామం మీ గుండెకు రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. చలికాలంలో బయట వ్యాయామం చేయడం కంటే.. ఇంట్లోనే వర్క్అవుట్స్ చేయండి.

హెల్తీ డైట్ తీసుకోండి.. మీ గుండె ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి.. మీ డైట్‌లో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రొటీన్లు తీసుకోండి. వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు, పీచు గుండె ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తాయి.

ఒత్తిడి తగ్గించుకోండి..
ఒత్తిడి కారణంగానూ గుండె సమస్యల ముప్పు పెరుగుతుంది. ఒత్తిడి తగ్గడానికి దోహదం చేసే ప్రాణాయామం, ధ్యానం వంటి వాటితో గుండెజబ్బు ముప్పు 48% వరకు తగ్గుతున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. కాబట్టి రోజూ కొంతసేపు ప్రశాంతమైన వాతావరణంలో వీటిని సాధన చేయడం మంచిది. నీళ్లు పుష్కలంగా తాగండి, ఎందుకంటే డీహైడ్రేషన్ గుండెపై ఒత్తిడిని కలిగిస్తుంది.

# ఇంట్లోనే పెడిక్యూర్ చేసుకోండిలా..!

బ్యూటీ పార్లర్‌లో పెడిక్యూర్ కోసం వందల రూపాయలు ఖర్చు చేస్తూ ఉంటారు. ఇంట్లోనే కొన్ని సహజ పదార్థాలతో మీ పాదాలను మెరిపించేయండి.

అందంగా ఉండాలని ఎవరికుండదు? అందంగా కనిపించడానికి ప్రయత్నం చేయని వారుండరు. ఈ రోజుల్లో.. జుట్టు నుంచి పాదాల వరకూ ప్రతి ఒక్కటీ అందంగా ఉండాలి అని కోరుకునే అమ్మాయిలే ఎక్కువ. అందం కోసం ఎంత ఖర్చైనా పెడుతున్నారు. మృదువైన, అందమైన కాళ్ల కోసం.. పార్లర్‌లో పెడిక్యూర్ చేయించుకుంటూ ఉంటారు. కొన్ని సార్లు పాదాలకీ అంత ఖర్చెందుకు అనిపిస్తుంది. ఇంట్లోనే కూర్చుని సహజ పదార్థాలతో మీ పాదాలను అందంగా, మృదువుగా మార్చుకోవచ్చు. అది ఎలానో ఈ స్టోరీలో చూద్దాం.



ముందుగా కాలి గోళ్ల పెయింట్‌ను తొలగించండి. తరువాత గోళ్లను అనుకున్న రీతిలో కట్ చేసుకోండి. ఆ తరువాత ఒక టబ్‌లో గోరువెచ్చని నీళ్లు తీసుకుని దానిలో చిటికెడు ఉప్పు, సుగంధ నూనే, నిమ్మరసం షాంపు వేసి 30 నిమిషాల పాటు పాదాలను నానబెట్టండి. ఉప్పును చేర్చటం వల్ల పాదాల్లోని దుమ్మును దూరం చేసి చర్మాన్ని మృదువుగా చేస్తుంది.

మంచి ప్యూమిస్‌స్టోన్‌తో మురికి వదిలేంత వరకూ స్క్రబ్ చేయాలి. లేదా గరుకుగా ఉండే పిండితో మడమలు అరికాళ్లు శుభ్రంగా రుద్దాం. పాదాల చుట్టూ పేరుకున్న మృతకణాలు, తెల్లనిపొర తొలగిపోయి మృదువుగా మారతాయి.

ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తరువాత మర్దనా ఆయిల్ లేదా మాయిశ్చరైజర్‌తో పాదాలను మొదట సుతిమెత్తంగా, తరువాత కాస్త గట్టిగా మసాజ్ చేసుకోండి.


ఇప్పుడు స్క్రబ్ చేసుకోవడానికి రెండు స్పూన్ల కొబ్బరి నూనె, నాలుగు చెంచాల చక్కెర, స్పూన్ చొప్పున నిమ్మరసం, తేనెలను ఒక గిన్నెలో వేసి బాగా మిక్స్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లు, అరికాళ్లకు మసాజ్ చేసి, ఆపై నీటితో కడిగేసుకోవాలి. ఆ తర్వాత మాయిశ్చరైజర్ అప్లై చేసుకోండి.

వారానికి రెండు సార్లు ఇలా..
పాదాలను మెరిపించడంలో అరటితొక్కలు చక్కగా పనిచేస్తాయి. అరటితొక్కలను పాదాలపైన రుద్దితే మృతకణాలు, దుమ్మూ ధూళీ తొలగిపోతాయి. అరటి తొక్కలను ముక్కలుగా తరిగి కొద్దిగా తేనె వేసి పేస్టు చేయాలి. ఈ పేస్టుని పాదాలకు రాయాలి. అరగంట తరువాత సాధారణ నీటితో కడిగేయాలి. ఇలా వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల పాదాలు మృదువుగా మారడంతో పాటు, చక్కగా మెరుస్తాయి.

గమనిక: ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

# శీతాకాలంలో మీ పిల్లల కళ్లను రక్షించడానికి..

శీతాకాలంలో పిల్లల కళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. ఎందుకంటే.. కఠినమైన వాతావరణం వారి కళ్ల పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అలెర్జీలు, కంటి వాపు, పొడిబారడం, కళ్ల నుంచి నీరు రావడం, కండ్లకలక వంటి సాధారణ వైరల్ ఇన్‌ఫెక్షన్లు.. ఎక్కువగా ఎటాక్ చేస్తుంటాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఈ సీజన్‌లో మీ పిల్ల కంటి ఆరోగ్యంపై మరింత కేర్ తీసుకుంటే మంచిది. కోయంబత్తూర్‌లోని శంకర ఐ హాస్పిటల్‌లోని పీడియాట్రిక్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ రాజేష్ ప్రభు.. చలికాలంలో చిన్నారుల కంటి సంరక్షణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మనకు వివరించారు.

రెప్పలు వేయమని గుర్తుచేయండి..
సాధారణంగా కొన్ని సెకన్లకోసారి కళ్లు ఆర్పుతాం. దీని ద్వారా కళ్లకు అలసట తగ్గడమే కాదు.. పొడిబారకుండానూ ఉంటాయి. ఈ డిజిటల్ జనరేషన్‌లో పిల్లలు ఫోన్లకు బాగా ఎడిక్ట్ అయ్యారు. గ్యాడ్జెట్లను చూసేప్పుడు కన్నులు ఆర్పడం మర్చిపోతూ ఉంటారు. దీంతో కళ్ల మంటలు, నీరు కారడం, తలనొప్పి వంటి సమస్యలు వస్తాయి. కనురెప్పలు వేయమని వారికి, తరుచు గుర్తుచేయండి. అంతేకాదు, ఓ నిమిషం పాటు అదేపనిగా కనురెప్పలు మూయడం, తెరవడం చేయమనండి. అలాగే రోజులో గుర్తుంచుకొని మరీ ఇలా కొన్ని సెకన్లు చేయమనండి. కంటిచూపు సమస్యలు రాకపోవడమే కాదు, ఏకాగ్రతా పెరుగుతుంది.

సరిపడా నీరు తాగిపించండి..
సరిపడా నీళ్లు, ద్రవ పదార్థాలు తీసుకుంటే.. శరీరం హైడ్రేట్‌గా ఉంటుంది. సరిపడా నీళ్లు శరీరాన్ని క్లీన్ చేస్తుంది, టాక్సిన్స్‌ను తొలగిస్తుంది. అంతేకాకుండా.. కంటి ఒత్తిడిని తగ్గిస్తుంది. మీ చిన్నారి హైడ్రేట్‌గా ఉండటానికి సరిపడా నీరు, ద్రవ పదార్థం అందించండి. రోజుకు కనీసం 8 గ్లాసుల నీరు ఇవ్వండి.

పైకి.. కిందకి..గంటల కొద్దీ చదవడం, అదే పనిగా గ్యాడ్జెట్లను చూస్తూ కూర్చోవడం .. కళ్లపై ఒత్తిడిని పెంచుతుంది. రెండు కళ్లనూ పైకీ, కిందకీ నెమ్మదిగా పలుమార్లు తిప్పాలి. తర్వాత అన్ని మూలలూ కలిసేలా గుండ్రంగా తిప్పాలి. ఇలా మూడు సెట్లలా చేయిస్తే చాలు. ఈ వ్యాయామం కంటిని ఆరోగ్యంగా ఉంచుతుంది. శీతాకాలం ఎండ తక్కువగా ఉన్నా.. యూవీ కిరణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి కంటికి హాని చేస్తాయి. మీ చిన్నారి కంటిని రక్షించడానికి.. వాళ్లు కూలింగ్ గ్లాసెస్ ధరించేలా చూసుకోండి. కళ్లద్దాలు.. పొగమంచు, వాయు కాలుష్యం నుంచి కూడా వారి కళ్లను రక్షిస్తాయి. రెండు అరచేతులను ఒకదానికొకటి మృదువుగా రుద్దుకొని కాస్త వేడి పుట్టగానే వాటిని కళ్లపై ఉంచుకోమని చెప్పాలి. దీంతో కళ్లకు రక్తప్రసరణ బాగా జరుగుతుంది. దృష్టి సంబంధిత సమస్యలు రావు. ఇలా 15 సార్లు చేయించాలి. ఆపై మనసులో ఏదైనా ఒక వస్తువును తలచుకుంటూ కళ్లు మూసుకొని అయిదు నిమిషాలు ధ్యానం చేయమనండి. ఇదీ కళ్ల ఆరోగ్యాన్ని రక్షిస్తుంది.


# కడుపు ఇన్ఫెక్షన్ ఉన్నవారు ఇవి తింటే..

కొందరికి తీసుకున్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడం, గ్యాస్ట్రిక్ సమస్యలు, వికారం, వాంతులు వంటి సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయి. ఇవి కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా కావచ్చు. దీన్ని స్టమక్ బగ్ అని కూడా పిలుస్తుంటారు. ఇది జీర్ణవ్యవస్థకు వాపు కలిగించే ఒక ఇన్ఫెక్షన్. ఇది సాధారణంగా.. నోరోవైరస్, రోటవైరస్ కారణంగా వస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ కారణంగా.. వికారం, వాంతులు, అతిసారం, జ్వరం, పొత్తికడుపు నొప్పి వంటి సమస్యలు ఎదురవుతాయి. ఆరోగ్యకరమైన ఆహారంతో.. కడుపులో ఇన్ఫెక్షన్‌ను నయం చేయలేనప్పటికీ.. దీని లక్షణాలను తగ్గించడానికి కొన్ని ఫుడ్స్ సహాయపడతాయి, ఇవి సమస్య నుంచి త్వరగా కోలుకోవడానికి మద్దతు ఇస్తాయి. విరేచనాలు, వాంతులు డీహైడ్రేషన్‌కు దారితీస్తాయి. అందుకే కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా బాధపడేవారు.. సరిపడా నీళ్లు తాగడం చాలా ముఖ్యం. కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా బాధపడేవారు ఎలాంటి ఫుడ్ తీసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.

అల్లం.. అల్లంలో శక్తివంతమైన యాంటీఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి కడుపు లైనింగ్‌కు ఉపశమనం ఇస్తాయి. అల్లం వికారం నుంచి ఉపశమనం ఇవ్వడానికి సహాయపడుతుంది. కడుపు ఇన్ఫెక్షన్ నుంచి.. ఇబ్బంది పడేవారు, అల్లం టీ తీసుకుంటే కడుపు ఇన్ఫెక్షన్ లక్షణాల నుంచి ఉపశమనం ఇస్తుంది. వారి డైట్‌లోనూ అల్లం చేర్చుకుంటే మంచిదని నిపుణులు అంటున్నారు.

అరటిపండ్లు.. అరటిపండ్లు.. సులభంగా జీర్ణమవుతుంది. అరటిపండ్లలోని ఫ్యాట్స్, పిండిపదార్థాలు, ప్రోటిన్, ఫైబర్, పొటాషియం, ఫాస్పరస్, పెప్టిన్, సుక్రోజ్, ఫ్రక్టోజ్, గ్లూకోజ్, విటమిన్–సి, విటమిన్–బి6 వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అరటిపండ్లలోని ఫైబర్ పేగు కదలికలను మెరుగుపరుస్తుంది. ఇది జీర్ణక్రియకు మేలు చేస్తుంది. కడుపు ఇన్ఫెక్షన్లతో బాధపడేవారు.. పండిన అరటిపండ్లు, అరటిపండు స్మూతీ తీసుకోవాలని నిపుణులు అంటున్నారు.







టోస్ట్.. నార్మల్ టోస్ట్ కడుపులోని అధిక యాసిడ్‌ను గ్రహిస్తుంది. ఇది కడుపు ఇన్ఫెక్షన్ నుంచి ఉపశమనం అందిస్తుంది. మీ డైట్‌లో హెూల్‌గ్రేయిన్, గ్లూటెన్ ఫ్రీ టోస్ట్ తీసుకోండి.

పెరుగు.. పెరుగులో ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ గట్‌లోని ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాను సమతుల్యను పునరుద్ధరిస్తాయి. కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా ఇబ్బందిపడేవారు వారి డైట్‌లో పెరుగు తీసుకోవాలని నిపుణులు అంటున్నారు.

అన్నం.. తెల్ల అన్నం కడుపుకు సున్నితంగా ఉంటుంది, సులభంగా జీర్ణమవుతుంది. దీనిలో కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శక్తి స్థాయిలను తిరిగి నింపడానికి సహాయపడతాయి.

చికెన్, కూరగాయలు సూప్.. కడుపు ఇన్ఫెక్షన్ కారణంగా ఇబ్బంది పడేవారు.. చికెన్, కూరగాయలు సూప్ తీసుకుంటే..కడుపుకు సున్నితంగా ఉంటుంది, శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడానికి సహాయపడతాయి. వీటిలో విటమిన్లు, మినరల్స్ కూడా అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియకు కూడా మేలు చేస్తుంది.,

లీన్ ప్రోటీన్.. ఉడికించిన చికెన్, చేపలు, టోఫు వంటి లీన్ ప్రొటీన్ మూలాలను తీసుకోవడం వల్ల కండరాల కణజాలాన్ని బాగు చేయడాని, నిర్వహించడానికి తోడ్పడతాయి. ఎక్కువ మసాలాలు లేకుండా.. మైల్డ్‌గా తీసుకోండి.

చామంతి టీ.. చమోమిలే టీలో ఓదార్పు గుణాలు ఉన్నాయి, ఇది కడుపు నొప్పి నుంచి ఉపశమనం ఇవ్వడానికి.. తోడ్పడతాయి. ఇది జీర్ణక్రియకు కూడా సహాయపడుతుంది. ఇది ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తుంది. కడుపు ఇన్ఫెక్షన్లతో బాధపడేవారు.. చామంతి టీ తీసుకోవాలని నిపుణులు అంటున్నారు.




# ఇన్వెస్టర్ల సంపదను డబుల్ చేసిన మ్యూచువల్ ఫండ్లు ఇవే..

మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ వారి సంఖ్య ఏటా పెరుగుతోందని చెప్పొచ్చు. గత నెలలో ఏకంగా రూ. 26,866 కోట్ల మేర పెట్టుబడులు రావడం విశేషం. న్యూ ఫండ్ ఆఫర్, థీమ్యాటిక్ ఫండ్స్ దీంట్లో కీలక పాత్ర వహించాయి. అయితే ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్‌లో గత 3 సంవత్సరాల వ్యవధిలో ఇన్వెస్టర్ల సంపదను రెట్టింపు చేసిన స్కీమ్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఈక్విటీ మార్కెట్లలో దేశీయ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. పెట్టుబడిదారుల్లో ఆసక్తి పెరుగుతున్న క్రమంలో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు ప్రతి ఏటా పెరుగుతున్నాయి. గత నెలలో రూ. 26,866 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జనవరి వచ్చిన రూ. 21 వేల కోట్లతో పోలిస్తే ఫిబ్రవరిలో 23 శాతం పెరిగాయి. ఇక మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ ఫిబ్రవరి చివరి నాటికి రూ. 54,54,214.13 కోట్లకు పెరిగింది. ముఖ్యంగా సిప్ ద్వారా వస్తున్న పెట్టుబడులే పెరిగాయి. కొత్త సిప్ అకౌంట్లు గత నెలలో 49,79,431 ప్రారంభం కావడం విశేషం. మ్యూచువల్ ఫండ్లతో బంపర్ రిటర్న్స్ వస్తాయని తెలిసిందే. ఇక్కడ కాంపౌండ్ ఇంట్రెస్ట్ కీలక పాత్ర పోషిస్తుంటుంది. వడ్డీపై వడ్డీ రావడంతో ఏటా రాబడి పెరుగుతూనే ఉంటుంది. స్టాక్ మార్కెట్లతో పోలిస్తే ఇక్కడ రిస్క్ కాస్త తక్కువ ఉంటుందని చెప్పొచ్చు. అందుకే దీంట్లో ఎక్కువగా సిప్ (క్రమానుగత పెట్టుబడులు) పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఇప్పుడు గడిచిన మూడేళ్లలో పెట్టుబడిదారుల సంపదను రెట్టింపు చేసినటువంటి ఫండ్ స్కీమ్స్ ఏమున్నాయో చూద్దాం.

క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్.. మ్యూచువల్ ఫండ్లలో క్వాంట్ స్కీమ్‌కు మంచి డిమాండ్ ఉంటుంది. ఎక్కువ రిటర్న్స్ ఇందులో వస్తుంటాయి. 3 సంవత్సరాల వ్యవధిలో క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్ 196 శాతం రిటర్న్స్ అందించింది. అంటే ఇక్కడ రూ. లక్ష పెట్టుబడి రూ. 2.95 లక్షలుగా మారింది.

క్వాంట్ మిడ్ క్యాప్ ఫండ్.. ఇది మూడేళ్ల కాలంలో 158 శాతం రిటర్న్స్ అందించగా.. రూ. లక్ష పెట్టుబడిని రూ. 2.58 లక్షలు చేసింది. క్వాంట్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ – 3 సంవత్సరాల్లో ఈ స్కీమ్ 144 శాతం రిటర్న్స్ అందించగా.. లక్ష పెట్టుబడి పెట్టిన వారికి రూ. 2.43 లక్షలొచ్చాయి.

నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్– ఇది 143 శాతం రిటర్న్స్ ఇచ్చింది. లక్ష పెట్టుబడిని మూడేళ్లలోనే రూ. 2.43 లక్షలుగా మలిచింది. స్మాల్ క్యాప్ ఫండ్ మూడేళ్లలో 138 శాతం రిటర్న్స్ ఇవ్వగా లక్షకు రూ. 2.38 లక్షలొచ్చాయి.

క్వాంట్ ఈఎల్ఎస్ఎస్ టాక్స్ సేవర్ ఫండ్ కూడా 3 సంవత్సరాల కాలంలో 134 శాతం పెరగ్గా.. లక్ష పెట్టుబడిని రూ. 2.33 లక్షలు చేసింది.

మోతీలాల్ ఓస్వాల్ మిడ్ క్యాప్ ఫండ్ 132 శాతం రిటర్న్స్ అందించగా.. లక్ష పెట్టుబడిపై రూ. 2.32 లక్షలొచ్చాయి. స్మాల్ క్యాప్ ఫండ్‌లో రూ. లక్షపై రూ. 2.26 లక్షలొచ్చాయి. అంటే ఇక్కడ 127 శాతం రిటర్న్స్ మూడేళ్లలోనే పొందారు ఇన్వెస్టర్లు. క్వాంట్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్– 3 సంవత్సరాల కాలంలో ఈ మ్యూచువల్ ఫండ్ స్కీమ్ 125 శాతం లాభాలు ఇవ్వగా.. రూ. లక్ష పెట్టినోళ్లకు రూ. 2.25 లక్షలు అందాయి. ఫ్రాంక్లిన్ ఇండియా స్మాలర్ కంపెనీస్ ఫండ్ 3 ఏళ్లకు 122 శాతం రిటర్న్స్ అందించగా లక్ష పెట్టుబడిని రూ. 2.21 లక్షలుగా మలిచింది.

# వారి కోసం ఎస్‌బీఐ స్పెషల్ స్కీమ్.. ఎక్కువ వడ్డీ దీంట్లోనే..

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కస్టమర్ల కోసం ఎన్నో రకాల స్కీమ్స్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లు ఆఫర్ చేస్తూ స్పెషల్ పథకాలు కూడా ప్రవేశపెట్టింది. వీటిల్లో అమృత్ కలశ్, సర్వోత్తమ్ ఎఫ్‌డీ, ఎస్‌బీఐ వీకేర్ వంటి స్కీమ్స్ వంటివి ఉన్నాయి. సీనియర్ సిటిజెన్ల కోసం ఉద్దేశించిన వీకేర్ పథకం గురించి ఇప్పుడు చూద్దాం. సీనియర్ సిటిజెన్ల కోసమే భారతీయ స్టేట్ బ్యాంక్ ఒక స్పెషల్ స్కీమ్ తీసుకొచ్చింది. అదే వీకేర్. సీనియర్ సిటిజెన్లకు ఈ పథకంలో భాగంగా రెగ్యులర్ డిపాజిట్లతో పోలిస్తే అధిక వడ్డీ అందిస్తుంది. 5 సంవత్సరాల నుంచి పదేళ్ల వ్యవధి డిపాజిట్లపై ప్రస్తుతం ఈ స్కీంలో ఎక్కువ వడ్డీ ఆఫర్ చేస్తోంది ఎస్‌బీఐ. ఈ స్కీమ్స్‌ను పరిమిత కాలవ్యవధితో తీసుకొస్తుంటాయి. ఇందులో చేరేందుకు గడువు ముగుస్తోంది. గతంలో కస్టమర్ల డిమాండ్ నేపథ్యంలో పలుమార్లు ఈ పథకాల గడువుల్ని పొడిగించిన ఎస్బీఐ.. మరి ఇప్పుడు పొడిగిస్తుందో లేదో చెప్పడం కష్టం. ప్రస్తుతానికి అయితే 2024, మార్చి 31 వరకు మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంది. ఈ మేరకు బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంది. ఫ్రెష్ డిపాజిట్స్ సహా రెనివల్ చేసుకునేవారికి కూడా ఈ స్కీమ్ వర్తిస్తుందని ఎస్బీఐ వెల్లడించింది. సాధారణంగా ఎస్‌బీఐ సహా ఇతర ఏ బ్యాంకులు అయినా జనరల్ సిటిజెన్లతో పోలిస్తే సీనియర్ సిటిజెన్లకు 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ ఎక్కువ అందిస్తుంటాయి. కూడా అలాగే ఆఫర్ చేస్తోంది. ఈ బ్యాంకు ఇప్పుడు సీనియర్ సిటిజెన్లకు వారం రోజుల నుంచి 10 సంవత్సరాల వ్యవధి డిపాజిట్లపై కనిష్టంగా 4 శాతం నుంచి 7.50 శాతం వరకు వడ్డీ అందిస్తోంది. అత్యధికంగా ఎస్బీఐ వీకేర్ స్పెషల్ ఎఫ్‌డీపైనే 7.50 శాతం వడ్డీ అందిస్తోంది. వీకేర్ స్పెషల్ ఎఫ్డీ టెన్యూర్ 5 నుంచి 10 ఏళ్లుగా ఉంటుంది. ఈ టెన్యూర్ డిపాజిట్‌పైనే అత్యధిక వడ్డీ అందుతోంది. దీంట్లో రూ. లక్ష జమ చేస్తే ఎంతొస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం. ఉదాహరణకు ఎస్బీఐ వీకేర్ స్కీమ్‌లో ఐదేళ్ల టెన్యూర్‌కు ఇప్పుడు రూ. లక్ష డిపాజిట్




చేసినట్లయితే ప్రస్తుతం ఉన్న 7.50 శాతం వడ్డీ లెక్కన మెచ్యూరిటీకి మీ చేతికి రూ. 44,995 వడ్డీ వస్తుంది. మీ చేతికి మొత్తం రూ. 1,44,995 అందుతుంది. అదే రూ. 5 లక్షలు డిపాజిట్ చేసినట్లయితే వడ్డీతో కలిపి మీ చేతికి రూ. 7,24,974 వస్తుంది.

ఇక ఈ బ్యాంకుల గురించి చూస్తే సీనియర్ సిటిజెన్లకు 7 నుంచి 45 రోజుల డిపాజిట్లపై 4 శాతం వడ్డీ, 46 రోజుల నుంచి 179 రోజుల పై 5.25 శాతం వడ్డీ వస్తుంది. 180–210 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 6.25 శాతం వడ్డీ, 211 రోజుల నుంచి ఏడాది లోపు డిపాజిట్లపై 6.50 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఏడాది నుంచి రెండేళ్ల డిపాజిట్లపై 7.30 శాతం, రెండేళ్ల నుంచి మూడేళ్ల డిపాజిట్లపైనా 7.50 శాతం వడ్డీ అందుతోంది. ఎస్‌బీఐ ఇతర స్పెషల్ స్కీమ్స్ విషయానికి వస్తే 400 రోజుల టెన్యూర్‌తో ఎస్‌బీఐ అమృత్ కలశ్ పథకం ఉంది. దీంట్లో రెగ్యులర్ సిటిజెన్లకు 7.10 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.60 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఈ స్కీం లాస్ట్ డేట్ కూడా 2024, మార్చి 31గానే ఉంది. ఎస్‌బీఐ గ్రీన్ డిపాజిట్లను కూడా ఆఫర్ చేస్తోంది. ఇందులో సీనియర్ సిటిజెన్లకు 1111, 1777, 2222 రోజుల టెన్యూర్ డిపాజిట్లపై వరుసగా 7.15 శాతం, 7.15 శాతం, 7.40 శాతం వడ్డీ వస్తోంది. సీనియర్ సిటిజెన్లకు ఎస్‌బీఐ సర్వోత్తమ్ ఎఫ్‌డీ కింద ఏడాది టెన్యూర్‌పై 7.60 శాతం, రెండేళ్ల టెన్యూర్‌పై 7.90 శాతం వడ్డీ అందుతోంది.

# సిబిల్ స్కోరు లేకున్నా ఈజీగా రుణం పొందొచ్చు

భారత్‌లోని అన్ని బ్యాంకుల్లో దాదాపు అన్ని రకాల లోన్లు అందుబాటులో ఉంటాయి. హోం లోన్, వెహికిల్ లోన్, పర్సనల్ లోన్ ఇలా ఏది కావాలన్నా సిబిల్ స్కోరు అనేది తప్పనిసరి అన్న సంగతి తెలిసిందే. అయితే సిబిల్ స్కోరు లేకుండా కూడా పర్సనల్ లోన్ పొందే అవకాశం ఉంటుందా. క్రెడిట్ స్కోరు లేకున్నా కొన్ని ప్రత్యేక అంశాల్ని పరిగణనలోకి తీసుకొని లోన్లు అందిస్తుంటాయి. అత్యవసర సమయాల్లో డబ్బు కావాలంటే పర్సనల్ లోన్లు ఉపయోగకరంగా ఉంటాయని చెప్పొచ్చు. తక్షణమే లోన్ కావాలంటే.. బ్యాంకులు మొదట చెక్ చేసేది అర్హతలు. అర్హతల విషయానికి వస్తే మొదట మంచి ఆదాయం ఉండాలి. మంచి సిబిల్ స్కోరు ఉండాలి. ఏ బ్యాంక్ అయినా లోన్ ఇచ్చే ముందు.. సదరు దరఖాస్తుదారు క్రెడిట్ హిస్టరీ (రుణ చరిత్ర) తెలుసుకుంటుంది. గతంలో మీరు తీసుకున్న లోన్ వివరాలు, గత చెల్లింపుల చరిత్ర, క్రెడిట్ కార్డుల వినియోగం ఇలా అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని లోన్




ఇవ్వాలా వద్దా అని చూస్తుంటాయి. అయితే సిబిల్ స్కోరు లేకుండా లోన్ పొందొచ్చా? ఈ ఛాన్స్ ఉంది. అదెలాగో చూద్దాం.

సిబిల్ స్కోరు లేకున్నా లోన్ ఇవ్వాలంటే బ్యాంకులు రిస్క్‌గా భావిస్తాయి. అయితే కొన్ని బ్యాంకులు, ఇతర నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు మాత్రం సిబిల్ స్కోరు లేకున్నా లోన్ ఆఫర్ చేస్తుంటాయి. దీని కోసం కొన్ని ప్రత్యేక పద్ధతుల్ని అనుసరిస్తుంటాయి. ఇక్కడ మీరు లోన్ తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని.. మీ శాలరీ స్లిప్స్, బ్యాంక్ స్టేట్‌మెంట్స్‌ను బట్టి అంచనా వేసి లోన్ మంజూరు చేయొచ్చు. మీకు ఏదైనా బ్యాంకులో శాలరీ అకౌంట్ ఉంటే.. మీ ఆర్థిక లావాదేవీల కు సంబంధించి రికార్డులు, వివరాలు వాటి దగ్గరే ఉంటాయి. ఇక్కడ ప్రీఅప్రూవ్డ్ లోన్లు లభించే అవకాశం ఉంటుంది. లోన్ ప్రాసెస్ కూడా వేగంగా జరుగుతుంది. కొన్ని రుణదాతలు సంప్రదాయ క్రెడిట్ స్కోరు కాకుండా ఇతర పద్ధతుల్ని అనుసరిస్తుంటాయి. మీ డిజిటల్ బ్యాంకింగ్ హిస్టరీ కావొచ్చు లేదా మీరు యుటిలిటీ బిల్స్ పేమెంట్ చేయడం వంటివాటిని పరిశీలిస్తాయి.మీ క్రెడిట్ స్కోరుతో పని లేకుండా గ్యారంటర్ సాయంతో లోన్ పొందొచ్చు. మీరు గ్యారంటర్‌గా పెట్టుకున్న వ్యక్తి రుణ చరిత్ర బాగుంటే సరిపోతుంది. మీకు సరైన క్రెడిట్ స్కోరు లేకపోయినా.. స్థిర ఆదాయం ఉందని నిరూపించగలిగితే రుణ సంస్థలు లోన్లు ఆఫర్ చేస్తాయి. దీని కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఆదాయపు పన్ను రిటర్న్స్ వంటివి సమర్పించాలి. ప్రధానంగా మీరు ఆర్థిక



క్రమశిక్షణ కలిగి ఉన్నారా లేదా అనే విషయమే చూస్తాయి.

ఇబ్బందులివే.. క్రెడిట్ స్కోరు చెక్ చేయకుండా రుణ సంస్థలు లోన్లు ఇచ్చేముందు మీరు కొన్ని అంశాల్ని పరిశీలించాల్సి ఉంటుంది. ఇక్కడ వడ్డీ రేట్లు ఇతర వాటితో పోలిస్తే ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. క్రెడిట్ స్కోరు 750 కంటే మెరుగ్గా ఉంటే చాలా బ్యాంకుల్లో తక్కువ వడ్డీకే లోన్లు వస్తాయి. సిబిల్ స్కోరు లేని సమయంలో రుణ దాతలు.. టెన్యూర్ ఎక్కువ కాలం ఇవ్వవు. అంటే తక్కువ కాలంలో నెలవారీగా పెద్ద మొత్తంలో ఈఎంఐలు చెల్లించాల్సి వస్తుంది. ఇది ఆర్థికంగా ఇబ్బందుల్ని సృష్టించే అవకాశం ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజులు సహా ఇతర టర్మ్స్ అండ్ కండీషన్స్ పేరిట ఎక్కువ రుసుములు వసూలు చేసే రిస్క్ ఉంటుంది.

# 93 ఏళ్ల వయసులో ఐదో పెళ్లి చేసుకోనున్న బిలియనీర్..

93 ఏళ్ల వయసులో పెళ్లికి సిద్ధమై బిజినెస్‌మెన్, బిలియనీర్ అయిన రూపర్ట్ మర్డోక్ మరోసారి వార్తల్లోకి ఎక్కారు. ఇప్పటికే నలుగురిని పెళ్లి చేసుకుని వారితో విడాకులు తీసుకున్న రూపర్ట్ మర్డోక్ ఐదోసారి పెళ్లికి సిద్ధం అయ్యారు. ఇటీవలే తన ప్రియురాలు 67 ఏళ్ల ఎలీనా జుకోవాతో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జూన్‌లో వీరిద్దరూ పెళ్లి చేసుకోనున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి.



ఫేమస్ ఆస్ట్రేలియన్–అమెరికన్ బిజినెస్‌మెన్, మీడియా టైకూన్, బిలియనీర్ రూపర్ట్ మర్డోక్ మరో పెళ్లికి సిద్ధం అయ్యారు. ఇప్పటికే 4 పెళ్లిళ్లు, 5 ఎంగేజ్‌మెంట్‌లు చేసుకున్న రూపర్ట్ మర్డోక్.. తాజాగా మరో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. ఇప్పటికే నలుగురు భార్యలకు విడాకులు ఇచ్చిన రూపర్ట్ మర్డోక్.. 93 ఏళ్ల వయసులో ఐదో వివాదం చేసుకునేందుకు రెడీ అయ్యారు. తన స్నేహితురాలు, 67 ఏళ్ల ఎలీనీ జుకోవాను మనువాడనున్నారు. వీరికి ఇటీవలె ఎంగేజ్‌మెంట్ కూడా జరిగినట్లు అమెరికా మీడియా వెల్లడించింది. దీంతో ఈ వివాహానికి సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్‌గా మారాయి. కాలిఫోర్నియాలోని తన ఎస్టేట్‌లో రూపర్ట్ మర్డోక్, ఎలీనీ జుకోవాను ఈ ఏడాది జూన్‌లో వివాహం చేసుకోనున్నట్లు ఆ మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే ఈ పెళ్లి వేడుకకు హాజరయ్యేవారికి ఆహ్వాన పత్రికలు కూడా పంపించినట్లు సమాచారం. రూపర్ట్ మర్డోక్‌కు ఇప్పటికే 4 పెళ్లిళ్లు, 5 ఎంగేజ్‌మెంట్లు అయ్యాయి. గత సంవత్సరం ఆన్ లెస్లీ స్మిత్‌తో రూపర్ట్ మర్డోక్‌కు ఎంగేజ్‌మెంట్ కాగా.. నెల రోజుల లోపే వారిద్దరూ విడిపోయారు. దీంతో వారికి పెళ్లి జరగలేదు. దీంతో ఈ ప్రస్తుతం ఆరో ఎంగేజ్‌మెంట్ కాగా.. జూన్‌లో ఐదో వివాహం జరగనుంది.

కొన్ని నెలల కిందట రూపర్ట్ మర్డోక్‌కు మాజీ భార్య విన్‌డీ డెంగ్ ఇచ్చిన ఓ పార్టీలో ఎలీనీ జుకోవా.. ఆయనకు పరిచయం అయ్యారు. అప్పటి నుంచి వీరిద్దరూ డేటింగ్‌లో ఉండగా.. తాజాగా ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. త్వరలోనే పెళ్లి కూడా చేసుకోనున్నారు. రష్యాకు చెందిన ఎలీనీ జుకోవా.. అమెరికాకు వలస వచ్చి స్థిరపడ్డారు. ఎలీనీ జుకోవాకు గతంలో మాస్కో ఆయిల్ బిలియనీర్ అయిన అలెగ్జాండర్‌తో పెళ్లి చేసుకుంది. వీరిద్దరికీ పుట్టిన కుమార్తె దాషా.. రష్యన్ ఓలిగార్క్‌ను వివాహం చేసుకోగా.. వారు తర్వాత విడాకులు తీసుకున్నారు. ఇక రూపర్ట్ మర్డోక్ విషయానికి వస్తే.. ఆయన మొట్టమొదట ఆస్ట్రేలియాకు చెందిన పాట్రిషియా బుకర్ అనే మహిళను పెళ్లి చేసుకోగా.. 1960 ల్లో వారు విడాకులు తీసుకుని దూరం అయ్యారు. ఆ తర్వాత జర్నలిస్ట్ అన్నా మరియా మన్‌ను పెళ్లి చేసుకుని విడిపోయారు. అనంతరం చైనా వ్యాపారవేత్త విన్‌డీ డెంగ్‌ను వివాహం చేసుకున్న రూపర్ట్ మర్డోక్ ఆమెకు కూడా విడాకులు ఇచ్చారు. ఆ తర్వాత అమెరికా మోడల్ జెర్రీ హాల్‌ను పెళ్లి చేసుకున్నా.. చివరికి ఆమెతో కూడా విడిపోయారు. ఇక తన రెండో భార్య జర్నలిస్ట్ అన్నా మరియా మన్ నుంచి విడిపోయిన సమయంలో రూపర్ట్ మర్డోక్ చెల్లించిన భరణం.. అత్యంత ఖరీదైన భరణాల్లో ఒకటిగా నిలిచింది. అప్పుడు 1.7 బిలియన్ డాలర్ల ఆస్తిని భరణంగా రాసి ఇచ్చినట్లు సమాచారం. 1950 ల్లో మీడియా కెరీర్‌ను ఆరంభించిన రూపర్ట్ మర్డోక్.. న్యూస్ ఆఫ్ ది వరల్డ్, ది సన్ న్యూస్ పేపర్లను ప్రారంభించారు. ఆ తర్వాత అమెరికాలో స్థిరపడి న్యూయార్క్ పోస్ట్, వాల్ స్ట్రీట్ జర్నల్ వంటి పబ్లికేషన్ సంస్థలను కొనుగోలు చేశారు. 1996 లో ఫాక్స్ న్యూస్‌ను ప్రారంభించిన రూపర్ట్ మర్డోక్.. 2013 లో న్యూస్‌కార్ప్ సంస్థను స్థాపించారు. ఇక తన కెరీర్‌లో అనేక వివాదాలు ఎదుర్కొన్న మర్డోక్.. 2011లో ఫోన్ హ్యాకింగ్ కుంభకోణం కారణంగా న్యూస్ ఆఫ్ ది వరల్డ్ పత్రికను మూసివేశారు. ఇక 2023 సెప్టెంబరులో తన వ్యాపారాలు మొత్తాన్ని కుమారులకు అప్పగించిన రూపర్ట్ మర్డోక్.. ప్రస్తుతం ఆయా సంస్థలకు గౌరవ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు.

**ఎలీనీ జుకోవాకు గతంలో మాస్కో ఆయిల్ బిలియనీర్ అయిన అలెగ్జాండర్‌తో పెళ్లి చేసుకుంది. వీరిద్దరికీ పుట్టిన కుమార్తె దాషా.. రష్యన్ ఓలిగార్క్‌ను వివాహం చేసుకోగా.. వారు తర్వాత విడాకులు తీసుకున్నారు. ఇక రూపర్ట్ మర్డోక్ విషయానికి వస్తే.. ఆయన మొట్టమొదట ఆస్ట్రేలియాకు చెందిన పాట్రిషియా బుకర్ అనే మహిళను పెళ్లి చేసుకోగా.. 1960 ల్లో వారు విడాకులు తీసుకుని దూరం అయ్యారు.**

# భారత్ అంటే అదే భయం, అదే అక్కసు.. 'జీ4 మోడల్' సాక్షిగా బుద్ధి బయటపెట్టిన పాకిస్థాన్

ఈ ప్రపంచంలో భారత్ ఎదుగుదలను జీర్ణించుకోని దేశాల జాబితా తీస్తే పాకిస్థాన్ ముందు ఉంటుంది. ఆ తర్వాతి స్థానం చైనాది అనుకోండి.. అది వేరే విషయం. ఐక్యరాజ్య సమితి సాక్షిగా.. భారత్ వ్యతిరేకతను పాకిస్థాన్ మరోసారి బయటపెట్టుకుంది. భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టాలని భారత్ సహా మిగతా దేశాలు డిమాండ్ చేస్తుండగా.. మన దేశానికి ఎక్కడ శాశ్వత సభ్యత్వం దక్కుతుందోనని పాకిస్థాన్ తెగ గింజుకుంటోంది. ఐరాసలో పాక్ రాయబారి స్పందనే దీనికి నిదర్శనం. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టాలని భారత్‌తోపాటు మిగతా దేశాలు ఎప్పటి నుంచో కోరుతున్న సంగతి తెలిసిందే కదా. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐక్యరాజ్య సమితి ఏర్పాటు కాగా.. నాటి పరిస్థితులకు అనుగుణంగా భద్రతా మండలిలో ఐదు దేశాలకు శాశత్వ సభ్యత్వం కల్పించగా.. మరో పది దేశాలకు తాత్కాలిక సభ్యత్వం ఉంది. అయితే ఈ 80 ఏళ్లలో ప్రపంచం ఎంతగానో మార్పులొచ్చాయి. కొత్త ఆర్థిక శక్తులు పుట్టుకొచ్చాయి. దీంతో భద్రతా మండలిలో మార్పులు చేయాలని చాలా ఏళ్లుగా ప్రపంచ దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్యదేశాలైన అమెరికా, రష్యా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, చైనాలకు మాత్రమే వీటో అధికారం ఉంది. ఈ ఐదు దేశాల్లో ఏ ఒక్క దేశమైనా సరే తనకున్న 'వీటో' అధికారంతో కీలక తీర్మానాలకు అడ్డు తగలొచ్చు. భద్రతా మండలిని విస్తరిస్తే.. ప్రపంచంలోకెల్లా అత్యధిక జనాభా ఉన్న, ప్రపంచంలోని ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్‌కు కచ్చితంగా అందులో చోటు కల్పించాలి. ఇది ఇష్టం లేని చైనా ఏవేవో సాకులు చెబుతోంది. భారత్‌తోపాటు జపాన్, బ్రెజిల్, జర్మనీ దేశాలు జీ4 కూటమిగా ఏర్పాటై.. భద్రతా మండలిలో సంస్కరణల పట్ల స్వరం వినిపిస్తున్నాయి. ఈ నాలుగు దేశాల తరఫున తరఫున ఐక్యరాజ్య సమితిలోని భారత రాయబారి రుచిరా కాంబోజ్ 'జీ–4 మోడల్' గురించి మిగతా సభ్య దేశాలకు వివరించారు. భద్రతా మండలి సంస్కరణపై ప్రభుత్వాల మధ్య చర్చ (ఇంటర్‌గవర్నమెంటల్ నెగోషియేషన్స్ ఆన్ సెక్యూరిటీ కౌన్సిల్ రీఫార్మ్స్ – ఐజీఎన్)ల్లో పాల్గొన్న సందర్భంగా రుచిరా జీ–4 మోడల్



గురించి ప్రసంగించారు.

1945 నాటి భౌగోళిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా భద్రతా మండలి ఏర్పాటైందని.. అప్పటితో పోలిస్తే ప్రపంచంలో ఎన్నో మార్పులొచ్చాయని భారత్ స్పష్టం చేసింది. దీంతో భద్రతా మండలిని విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ప్రస్తుతం భద్రతా మండలిలో 15 దేశాలకు సభ్యత్వం ఉండగా.. దీన్ని 25–26కు పెంచాలని సూచించింది. కొత్తగా ఆరు దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించాలని.. ప్రస్తుతమున్న పది దేశాలకు అదనంగా మరో 4 లేదా 5 దేశాలకు తాత్కాలిక సభ్యత్వం కల్పించాలని భారత్ డిమాండ్ చేసింది. ఆఫ్రికా, ఆసియా నుంచి రెండు దేశాలు చొప్పున, లాటిన్ అమెరికా అండ్ కరేబియన్ దేశాల నుంచి ఒక దేశానికి, పశ్చిమ యూరప్ ఇతర ప్రాంతాల నుంచి మరో దేశానికి శాశ్వత సభ్యత్వం కల్పించాలని భారత్ ప్రతిపాదించింది. అయితే ఏ దేశానికి శాశ్వత సభ్యత్వం కల్పించా లనే విషయాన్ని మాత్రం జీ4 మోడల్ చెప్పడం లేదని భారత రాయబారి రుచిరా తెలిపారు. కొత్తగా శాశ్వత సభ్యత్వం పొందే దేశాలకు ఇప్పటి శాశ్వత సభ్యదేశాల్లాగే అన్ని హక్కులు, బాధ్యతలు ఉంటాయని.. అయితే వీటో విషయంలో సమీక్షించి ఓ నిర్ణయం తీసుకునే వరకు కొత్తగా సభ్యత్వం పొందే దేశాలు వీటోను ఉపయోగించవని జీ–4 మోడల్ పేర్కొంది. అంతే కాదు చైనా తనకున్న వీటో అధికారంతో సంస్కరణలకు అడ్డు తగిలే అవకాశం ఉండటంతో.. మండలి సంస్కరణల విషయంలో వీటో చేయడానికి అనుమతించొద్దని కూడా సూచించింది. వచ్చే ఏడాది ఐరాస 80వ వార్షికోత్సవం ఉన్న నేపథ్యంలో భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టడానికి ఇదే మంచి సమయమని.. ప్రపంచ దేశఆలు, భావితరాలు ఇంకెంతో కాలం ఎదురు చూడలేవని కాంబోజ్ స్పష్టం చేశారు. చారిత్రకంగా జరిగిన అన్యాయాలు మరింత పెరుగుతున్న నేపథ్యంలో.. వాటిని సరిచేయా ల్సిన అవసరం ఉందన్నారు. భారత్ ప్రతిపాదించిన జీ–4 మోడల్‌ను ఫ్రాన్స్ స్వాగతించగా.. అమెరికా సైతం సుముఖత వ్యక్తం చేసింది. భారత్ జీ–4 మోడల్‌ను ప్రజెంట్ చేయగానే.. పాకిస్థాన్ దాన్ని వ్యతిరేకించింది. భారత్‌కు శాశ్వత సభ్యత్వం దక్కడం ఏమాత్రం ఇష్టం లేని పాకిస్థాన్ మరోసారి తన బుద్ధిని బయటపెట్టుకుంది. జీ–4 మోడల్ అప్రజాస్వామికమని, దానికి జవాబుదారీతనం లేనిదని, అసమానతలను పెంచేలా ఉందని దాని వల్ల నష్టం తప్పితే లాభం లేదని ఐరాసలోని పాకిస్థాన్ రాయబారి మునీర్ అక్రమ్ ఆరోపించారు. భద్రతా మండలిలో మార్పులకు తాము వ్యతిరేకమని పాకిస్థాన్ తెలిపింది. భద్రతా మండలిలో మార్పులు చేయాలంటున్న జీ–4 దేశాల ప్రతిపాదన వెనుక ఆంతర్యం ఏంటని మునీర్ ప్రశ్నించారు. జీ–4 మోడల్ ప్రపంచాన్ని వ్యతిరేక దిశలో నడిపిస్తుందని.. కొత్తగా ఆరు దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించి.. 5 దేశాలకు మాత్రమే తాత్కాలిక సభ్యత్వం కల్పిస్తే.. శాశ్వత, తాత్కాలిక సభ్య దేశాల మధ్య నిష్పత్తి సగానికి తగ్గుతుందని.. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం పొందలేని మిగతా 182 దేశాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశాలు తగ్గుతాయని పాకిస్థాన్ రాయబారి చెప్పారు. ఇప్పుడున్న తాత్కాలిక సభ్య దేశాల సంఖ్యను పది నుంచి 15–16కి పెంచితే ప్రపంచ దేశాల ప్రాతినిధ్యం ఎలా తగ్గుతుందో ఆ పాకిస్థాన్ రాయబారికే తెలియాలి. పాకిస్థాన్ ఉద్దేశం మంచిదే అయితే.. తాత్కాలిక సభ్య దేశాల సంఖ్యను ఇంకా పెంచాలనే సూచన చేయాలని తప్పితే.. జీ–4 మోడల్‌నే తప్పుబట్టడం అనేది.. భారత్ పట్ల ఆ దేశానికి ఉన్న భయాన్ని బయటపెట్టేలా ఉంది తప్పితే మరొకటి కాదు.



# ప్లే ఆఫ్స్‌కు ఆర్సీబీ..

## పంజాబ్‌కు వరుసగా ఆరో ఓటమి





**ధర్మశాల:** ఐపీఎల్ 2026లో ఆర్సీబీ ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ 23 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 223 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన పంజాబ్.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసింది. శశాంక్ సింగ్ 56, స్టొయినిస్ 37, కనోలి 37, సూర్యాంశ్ 35 రన్స్ చేశారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ 2, సలామ్ దార్ 3 వికెట్లు పడగొట్టారు. హేజిల్‌వుడ్, సుయాశ్ శర్మ, రొమారియో షెఫర్డ్ తలో వికెట్ తీశారు. వరుసగా ఆరో ఓటమి చవిచూసిన పంజాబ్ ప్లే ఆఫ్స్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది. ఇప్పటివరకు 13 మ్యాచ్‌లు ఆడి 13 పాయింట్లతో ఉన్న పంజాబ్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచినా ముందంజ వేస్తుందని కచ్చితంగా చెప్పలేం.తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. ఓపెనర్ జాకబ్ బెతెల్ (11) నిరాశపర్చినా.. వెంకటేశ్ అయ్యర్ (73; 40 బంతులలో 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (58; 37 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. దేవ్‌దత్ పడిక్కల్ (45; 25 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (28; 12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ 2, అర్షదీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్ ఒక్కో వికెట్ పడగొట్టారు.


# రాజస్థాన్ రాయల్స్‌కు హ్యాట్రిక్ ఓటమి

## దిల్లీ ప్లేఆఫ్స్ ఆశలు సజీవం

దిల్లీ: ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్‌కు హ్యాట్రిక్ ఓటమి. రియాన్ పరాగ్ సేనపై దిల్లీ క్యాపిటల్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 8 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని దిల్లీ 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కేఎల్ రాహుల్ (56; 42 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), అభిషేక్ పొరెల్ (51; 21 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభం అందించారు. అక్షర్ పటేల్ (34; 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అశుతోష్ శర్మ (18; 5 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) జట్టును విజయతీరాలకు చేర్చారు. ట్రిస్టన్ స్టబ్స్ (4), డేవిడ్ మిల్లర్ (9), సాహిల్ పరాఖ్ (9) నిరాశపర్చారు. రాజస్థాన్ బౌలర్లలో ఆర్చర్ 2, బ్రిజేష్ శర్మ 2, దాసున్ శనక ఒక వికెట్ తీశారు. రాజస్థాన్ బ్యాటర్లలో రియాన్ పరాగ్ (51; 26 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు), ధ్రువ్ జురెల్ (53; 40 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకాలతో మెరిశారు. వైభవ్ సూర్యవంశీ (46; 21 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించాడు. యశస్వి జైస్వాల్ (12) తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు. దిల్లీ బౌలర్లలో స్టార్క్ 4, ఎంగిడి 2, మాధవ్ తివారీ 2 వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో 12 పాయింట్లకు చేరుకున్న దిల్లీ సాంకేతికంగా ఇంకా ప్లే ఆఫ్స్ రేసులో ఉంది. లీగ్ దశలో మరో మ్యాచ్ ఆడాల్సింది. ప్రస్తుతం 12 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ రాయల్స్ ప్లే ఆఫ్స్ చేరాలంటే తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలవాలి. ఇతర జట్ల ఫలితాలు కూడా కలిసొస్తేనే రాజస్థాన్ ముందంజ వేస్తుంది.







# గ్లామరస్ లుక్‌లో నయనతార

లేడీ సూపర్ స్టార్ నయనతార గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. కోలీవుడ్ చిత్రాల ద్వారా కెరీర్ ప్రారంభించిన ఈమె ఆ తర్వాత తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి రెండు భాషల్లోనూ స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ఇప్పటికీ కూడా నయన్ వరుస సినిమాలతో బిజీగా ఉంటూ తిరుగులేని నటిగా కెరీర్‌ను కొనసాగిస్తోంది. ప్రస్తుతం తమిళ్, తెలుగు చిత్రాలతో పాటు హిందీ సినిమాల్లో కూడా నటిస్తోంది. వయసు పెరిగినా నయనతార అందంలో మాత్రం ఏమాత్రం తగ్గుదల కనిపించడం లేదు. కుర్ర హీరోయిన్లకు పోటీగా గ్లామర్‌ను మెయింటైన్ చేస్తూనే అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అందుకే ఈమెకు వరుసగా క్రేజీ ప్రాజెక్ట్‌లలో అవకాశాలు దక్కుతున్నాయి. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ అప్పుడప్పుడు తనకు సంబంధించిన ఫోటోలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. తాజాగా నయన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. వాటిలో వైట్ అండ్ బ్లాక్ కాంబినేషన్‌లో ఉన్న స్లీవ్‌లెస్ డ్రెస్ ధరించి స్టైలిష్ లుక్‌లో కనిపించింది. హెయిర్‌ను అందంగా ముడివేసుకొని ఇచ్చిన పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మొత్తంగా ఈ ఫోటోలలో నయన్ స్టైలిష్ అండ్ గ్లామరస్ లుక్‌లో కనిపించడంతో ప్రస్తుతం ఆ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# మానసికంగా ఎదురుదెబ్బ తిన్నా

'మహానటి' సినిమాతో యావత్ భారతదేశాన్ని తన నటనతో మంత్రముగ్ధులను చేసి జాతీయ అవార్డు గెలుచుకున్న నటి కీర్తి సురేష్ ఆ తర్వాత ఎన్నో చిత్రాల్లో నటించింది. కెరీర్ తొలినాళ్లలో కాస్త బొద్దుగా ఉన్న కీర్తి.. ఇటీవల కొంత జీరో సైజ్ లుక్‌లో మారిపోయింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. అయితే గత కొంతకాలంగా ఆమె లుక్‌పై సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ నడుస్తోంది. బొద్దుగా ఉన్న కీర్తి ఒక్కసారిగా జీరో సైజ్ లుక్‌లోకి మారడంతో.. ఆమె అందం కోసం లైపోసక్షన్, బేరియాట్రిక్ వంటి సర్జరీలు చేయించుకుందంటూ నెట్టింట పుకార్లు షికార్లు చేశాయి. ఈ రూమర్లపై ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న కీర్తి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టి ట్రోలర్ల నోళ్లు మూయించింది. తన బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్ వెనుక ఉన్న అసలైన కష్టాన్ని, కన్నీళ్లను ప్రపంచానికి పరిచయం చేసింది. తాను బరువు తగ్గడం వెనుక ఉన్న కష్టాన్ని వివరిస్తూ, 2018లో 'మహానటి' సినిమా తర్వాత హై-ప్రోటీన్, లో-కార్బ్ ఫుడ్‌తో పాటు విపరీతమైన వర్కవుట్స్ హెచ్‌ఐటీ, కార్డియో వ్యాయామాలు చేసి 9 నెలల్లో 10 కిలోలు తగ్గానని కీర్తి చెప్పింది. ఆ సమయంలో తను చాలా గర్వంగా ఫీల్ అయ్యానని, కానీ జనాలు మాత్రం తను సర్జరీలు చేయించుకుందని అనడం చూసి బాధ కలిగిందని పేర్కొంది. "నేను ఎప్పుడూ నా ముఖంతో సహా అన్నింటినీ సహజంగానే ఉంచుకున్నాను. నా కష్టమంతా ఒక కత్తి కింద నలిగిపోయిందన్న మాట వినగానే కొంచెం బాధేసింది" అంటూ సర్జరీ పుకార్లను పూర్తిగా కొట్టిపారేసింది. ఆ తర్వాత 2020లో తాను యోగా వైపు మళ్లానని, అది తనకు మానసిక ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని కీర్తి తెలిపింది. ప్రస్తుతం తన ఫిట్‌నెస్ దినచర్యలో స్ట్రెంగ్త్ ట్రైనింగ్, యోగా, యానిమల్ ఫ్లో, కాలిస్థెనిక్స్ వంటివి భాగమయ్యాయని చెప్పింది. "మనం బొద్దుగా ఉంటే సన్నగా అవ్వాలంటారు, సన్నగా ఉంటే బొద్దుగా ఉండాల్సింది అంటారు.. ఈ ప్రపంచం ఎలా ఆలోచిస్తుందో అని ఒక్కోసారి ఆశ్చర్యమేస్తుంది" అంటూ ఫైర్ అయింది. గత కొన్ని నెలలుగా తాను శారీరకంగా, మానసికంగా కొంత ఎదురుదెబ్బను తిన్నానని, అందుకే అందుబాటులో లేను అని కీర్తి ఓపెన్ అయ్యింది. అయితే జీవితంలో ఎలాంటి కష్టాలు వచ్చినా, విరామం తీసుకోవాల్సి వచ్చినా తీసుకుంటాను కానీ.. ఎప్పటికీ వదులుకోను అంటూ రాసుకొచ్చింది. కీర్తి సురేష్ పెట్టిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్





# కృతి శెట్టి గ్లామర్ ట్రీట్

ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె ఇప్పటివరకు అనేక తెలుగు సినిమాల్లో నటించి మంచి గుర్తింపును సంపాదించుకుంది. ఈ మధ్యకాలంలో ఇతర భాషా చిత్రాల్లో నటించడంపైనా ఆసక్తి చూపుతోంది. కెరీర్ ప్రారంభమైనప్పటి నుంచే తన అందాల ఆరబోతతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తోంది. సినిమాల్లో మాత్రమే కాకుండా సోషల్ మీడియాలో కూడా అదే స్థాయిలో గ్లామర్ ట్రీట్ ఇస్తూ అభిమానులను అలరిస్తోంది. ముఖ్యంగా తన బ్యాక్ అందాలతో యువతను బాగా ఆకర్షిస్తుంది. అనేక సందర్భాల్లో తన వెనుక అందాలు హైలైట్ అయ్యేలా ఫోటోలకు స్టిల్స్ ఇచ్చింది. అలాంటి ఫోటోలు సోషల్ మీడియాలో భారీగా వైరల్ అయిన సందర్భాలు కూడా చాలానే ఉన్నాయి. ఈ బ్యూటీ ఫోటోషూట్‌లలో ఒకటి, రెండు ఫోటోలు తప్పనిసరిగా బ్యాక్ అందాలు హైలైట్ అయ్యేలా ఉండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. దీంతో ఆమె ఫోటోలకు మంచి క్రేజ్ ఏర్పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇలా కృతి శెట్టి తన గ్లామర్‌తో, ముఖ్యంగా బ్యాక్ లుక్‌తో పలుమార్లు యువత మనసు దోచుకుంది.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.